1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

గురువారం | మార్చి 13, 2025 | www.navatelangana.com

షార్ట్‌సర్క్యూట్‌తో ఫైర్ యాక్సిడెంట్

- 5 దుకాణాలు దగ్ధం

నవతెలంగాణ-ఆర్మూర్

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ 44వ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం దుకాణాల సముదాయంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. భారత్ పెట్రోల్ పంపు పక్కన 5 దుకాణ సముదాలయాలకు అగ్ని ప్రమాదం సంభవించగా స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఈ సముదాయాలలో గల కిరణా షాప్, హెూటల్, ఆటోమొబైల్ షాపులను నిర్వహిస్తూ పలువురు ఉపాధి పొందుతున్నారు. సుమారుగా ఐదు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధిత దుకాణ యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న వెంటనే మంటలను ఆర్పి వేసినట్టు అగ్నిమాపక అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని సంబంధిత దుకాణదారులు వేడుకుంటున్నారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పసుపు రైతుల అభివృద్దే లక్ష్యం

- రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాస్తే పసుపునకు మద్దతు ధర
- పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి

నవతెలంగాణ-ఆలూర్(ఆర్మూర్)

పసుపు రైతుల అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండల కేంద్రంలో బుధవారం పసుపు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పసుపు సాగు విస్తరణ, మార్కెట్ సదుపాయాలు, ధర స్థిరీకరణపై ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.



చైర్మన్‌ను సన్మానిస్తున్న పలువురు

వివరాలు మెయిన్‌లో..



కన్నీటి ధార

నవతెలంగాణ-లింగంపేట్

వేసవికాలం సమీపించక ముందే రోజురోజుకు భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. నీటి వినియోగం పెరిగేకొద్దీ.. భూగర్భ జల మట్టం ఇంతకింతకు దిగజారుతున్నాయి. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా సగటు నీటి మట్టం 12.98 మీటర్ల లోతుల్లోకి పడిపోయింది. ప్రతినెల క్రమంగా తగ్గుతూ వస్తుంది. కాగా 17 మండలాల్లో 15 మీటర్ల లోతుల్లోకి వెళ్లిపోవడంతో బోర్లు సన్నటి ధార పోస్తున్నాయి. మరికొన్ని చోట్ల బోర్లు గ్యాప్ ఇచ్చి పోస్తుండటంతో వరి పంట గట్టెక్కేనా..? అని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పంట చేతికొచ్చే వరకు సరిపడా నీటి తడులు ఇస్తూ నీటిని, పంటలను కాపాడుకునే ప్రయత్నం చేయాలని సూచిస్తున్నారు.

యాసంగిలో కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 3 లక్షల 85 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇందులో ముఖ్యంగా వరి 2 లక్షల 65 వేల ఎకరాల్లో సాగు చేశారు. నిజాంసాగర్, కౌలాస్‌నాళా, సింగీతం, పోచారం ప్రాజెక్టుల కాలువల ద్వారా జిల్లా వ్యాప్తంగా 40 వేల ఎకరాల వరి పంటకు సాగునీరు అందనుండగా.. మిగతా సుమారు 2.20 లక్షల ఎకరాలకు బోరుబావులే దిక్కు. అధికారుల అంచనా ప్రకారం.. సాగునీరు అందించేందుకు జిల్లా వ్యాప్తంగా సుమారు 95 వేల బోరుబావులున్నట్టు అంచనా.

ప్రతినెలా తగ్గుతున్న నీటిమట్టం

జిల్లా వ్యాప్తంగా గడిచిన మూడు నెలలు చూసుకుంటే.. ప్రతి నెలా నీటి మట్టం క్రమంగా తగ్గుతూ వస్తుంది. ఎండలు ముదరడంతో పాటు నీటి వినియోగం పెరగడంతో క్రమంగా నీటి మట్టం పడిపోతోంది. డిసెంబర్ నెలలో సాధారణ నీటిమట్టం 9.77 మీటర్లు ఉండగా.. జనవరికి వచ్చే సరికి 10.68 మీటర్లకు తగ్గింది. ఇక ఫిబ్రవరి నెలాఖరుకు 12.98 మీటర్ల లోతుల్లోకి నీటిమట్టం పడిపోయింది. కాగా గతేడాది ఫిబ్రవరి నెలాఖరులో 10.28 మీటర్ల లోతుల్లో ఉండగా.. ఈసారి మరింత లోతుల్లోకి దిగజారాయి. ఈ ప్రభావంతో బోరుబావుల్లో నీరు తగ్గి సన్నటి ధార పోస్తున్నాయి. తాగునీటికి సైతం ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.

ఎండల ప్రభావంతోనే..

సతీష్ యాదవ్.. భూగర్భ జిల్లా శాఖ అధికారి

ఎండలు తీవ్రతరం కావడంతో నీటి వినియోగం పెరిగి భూగర్భ జలాలు పడిపోతున్నాయి. నీటిని వీలైనంత పొదుపుగా వాడుకోవాలి. లేకుంటే చివరి దశలో పంటలు ఎండిపోయే అవకాశం ఉంది.

పలు చోట్ల ప్రమాకర పరిస్థితులు

రోజు రోజుకు భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో జిల్లాలోని పలు మండలాల్లో కొన్ని ప్రాంతాల్లో భూగర్భ నీటి మట్టం ప్రమాదకర స్థాయిలో చేరింది. జిల్లాలోని బీబీపేట్, పిట్లం, దోమకొండ, భిక్కనూర్, కామారెడ్డి, గాంధారి, రాజంపేట్ తదితర మండలాల్లో ప్రమాదకర స్థితిలో 15 నుంచి 20 మీటర్ల లోతుల్లో నీటిమట్టం పడిపోవడం గమనార్హం. ప్రస్తుతం ఎండలు ముదురుతుండటంతో నీటిమట్టం ప్రమాకరస్థితిలో పడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎండలతో పంటకు ఎంత నీరు అందించినా వెంటనే ఆరిపోతోందని రైతులు వాపోతున్నారు. వరికి పొట్ట దశలో నీళ్ల ఎక్కువగా అవసరం. కానీ ఇప్పుడే బోర్లు సన్నగా పోస్తు, గ్యాప్ ఇస్తుండటంతో సరిపడా నీరు అందడం లేదు. ఎండలు మరింత తీవ్రమైతే భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయే అవకాశాలున్నాయి. బోర్లు ఎత్తిపోయే ప్రమాదం ఉంది. కాగా ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పంటలు గట్టెక్కేవరకు నీటి అవసరం మేర ఉపయోగించాలని కోరుతున్నారు.

గ్యాప్ ఇస్తూ..
సన్నగా పోస్తున్న బోర్లు

- నెలనెలకు తగ్గుతున్న భూగర్భనీటిమట్టం
- జిల్లాలో ఎక్కువ మండలాల్లో 20 మీటర్ల లోతుల్లో..
- ఆందోళన చెందుతున్న రైతులు
- పంటలు చేతికి వచ్చే వరకూ
- పొదుపుగా వినియోగించుకోవాలని సూచిస్తున్న అధికారులు



ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- సమాజంలో సగభాగంగా అద్భుతాలు సృష్టించాలి : జిల్లా జడ్జి సునీత కుంచాల

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న జిల్లా జడ్జీ కుంచాల సునీత.. పలువురికి సన్మానం

సమాజంలో సగభాగం అయిన మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతూ అద్భుతాలు సాధించాలని జిల్లా జడ్జి సునీత కుంచాల ఆకాంక్షించారు. మహిళలు ఏ విషయంలోనూ తక్కువ కాదని, అన్ని రంగాలలోనూ పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీ పడుతూ రాణించాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని, బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం ప్రారంభించి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి సునీత కుంచాల విచ్చేయగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, అదనపు కలెక్టర్ అంకిత్, అదనపు డీసీపీ బస్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ ముఖ్యంగా ప్రతి మహిళ విద్య, క్రీడలు, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో అభివృద్ధిని సాధించాలని అభిలషించారు. మహిళలు తమ హక్కులను, బాధ్యతలను గుర్తెరిగి వాటిని కాపాడుకునేందుకు కృషి చేయాలన్నారు. అప్పుడే సమాజంలో సముచిత గౌరవం, గుర్తింపు లభిస్తుందన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు, వివిధ సంస్థల వారు అందిస్తున్న తోడ్పాటును పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని అభివృద్ధి దిశగా అడుగులు ముందుకు వేయాలని సూచించారు. మోసాలకు, అన్యాయాలకు గురైన సందర్భాలలో న్యాయం కోసం పోరాడాలని అన్నారు. జిల్లా స్థాయిలో వివిధ రంగాలలో ఉత్తమ సేవలందించిన మహిళలకు శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి రసూల్ బీ, మహిళా కమిషన్ మెంబర్ సూదం లక్ష్మి, డి.యం.హెచ్.ఓ రాజశ్రీ, జిల్లా బీసీ సంక్షేమ అధికారి స్రవంతి, డాక్టర్ ప్రతిమారాజ్, రిటైర్డ్ డీడబ్ల్యూవో సరళ, సిడిపివోలు, సూపర్ వైజర్లు, అంగన్వాడీ టీచర్లు గ్రామీణాభివృద్ధి శాఖా ఏపియంలు, సిసిలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా ఎస్పి రాజేష్ చంద్ర
- గాంధారి పోలీస్ స్టేషన్ తనిఖీ

నవతెలంగాణ-గాంధారి

పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఎస్పి రాజేష్ చంద్ర అన్నారు. బుధవారం గాంధారి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా రాయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాసులు, సదాశివ నగర్ సిఐ సంతోష్, గాంధారి ఎస్సై ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

ఆర్‌టీఏ ఆఫీస్‌లో ఏసీబీ రైడ్

- ఏజెంట్ నుంచి నగదు, ఆర్‌సీలు స్వాధీనం
- పలు అక్రమాలు గుర్తింపు.. నివేదిస్తాం : ఏసీబీ డీఎస్పీ



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంపై నిజామాబాద్ ఏసిబి అధికారులు బుధవారం ఆకస్మికంగా రైడ్ చేశారు. రవాణా శాఖ కార్యాలయంలో జరిగిన తనిఖీలపై నిజామాబాద్ ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ.. సోదాల సమయంలో నిజామాబాద్ జిల్లా రవాణా కార్యాలయంలో ఏజెంట్ అయిన ఎండి. ఖలీల్ వద్ద లెక్కల్లోకి రాని రూ. 27,000 నగదు లభించగా ఆ మొత్తాన్ని అతని నుండి స్వాధీనం చేసుకున్నారు. లెక్కలోకి రాని మొత్తంతో పాటు, అతని వద్ద 14 మోటార్ సైకిళ్ల ఒరిజినల్ ఆర్సీలు, 3 డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉన్నాయి. వీటిని తనిఖీ చేస్తున్నామన్నారు. పరిశీలనల సమయంలో చాలా దరఖాస్తులకు కొంత కోడ్ ఉందని, వాటిని ధ్రువీకరిస్తున్నట్లు తెలిపారు. పలు అక్రమాలు జరుగుతున్నట్టు తేలిందని తెలిపారు. అవసరమైన చర్యలు తీసుకోవడానికి తప్పు చేసిన అధికారులపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు.

1064 (టోల్ ఫ్రీ నంబర్) కు కాల్ చేయండి : ఏసిబి డిఎస్పి శేఖర్‌గౌడ్

ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగిన సందర్భంలో, చట్ట ప్రకారం చర్య తీసుకోవడానికి ప్రజలు ఏసీబీ యొక్క టోల్ ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలని సూచించారు. ఏసిబి తెలంగాణను సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు వాట్సాప్ నంబర్ (9440446106), ఫేస్‌బుక్ (తెలంగాణ ఏసీబీ), ఎక్స్ (తెలంగాణ ఏసీబీ) ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారు, బాధితుడి పేరు వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్డీవో

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి నూతన ఆర్డీవో గా వీణ బుధవారం పదవి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేను అందించారు.



రోడ్డు ప్రమాదంలో జింక మృతి

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం బండారుపల్లె సమీపంలోని రాజన్న చౌరస్తా వద్ద రోడ్డు దాటుతున్న జింకను గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో జింక తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అటవీ శాఖాధికారులు ఘటన స్థలానికి చేరుకుని జింక కళేభరం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి కళేబరాన్ని పూడ్చిపెట్టనున్నట్లు తెలిపారు.



మనుస్మృతితో మహిళపై వివక్ష

- వంటింటికే పరిమితం చేసే కుట్ర
- మహిళలపై దాడులను పట్టని పాలకులు
- అన్యాయాలు ఎదురించేందుకు మహిళాలోకం ఏకం కావాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నవతెలంగాణ-బోధన్

అనాదికాలం నుండి మహిళలు వివక్షతకు గురవుతున్నారని, దేశంలో మనుస్మృతి మహిళను తండ్రి చాటు బిడ్డగా భర్త చాటు ఇల్లాలుగా కొడుకు చాటు తల్లిగానే బతకాలని ఆదేశిస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేశ్‌బాబు అన్నారు. ఇప్పటికే మహిళను వంటింటికే పరిమితం చేశారన్నారు. కానీ నేడు మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళల దినోత్సవాన్ని బోధన్ పట్టణంలోని లయన్స్ ఆడిటోరియంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు శంకర్‌గౌడ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడారు. ఈ దేశంలో గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం హయాంలో మహిళలపై హింస పెరిగిందని విమర్శించారు. భారత్ మాతాకీ జై అని పలికే బిజెపి నాయకులు ఈ దేశంలోని మెజార్టీ మహిళలు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానంలో చాలీచాలని జీతాలతో అనేక ఇబ్బందులు పడుతుంటే ఏ ఒక్కరోజు మాట్లాడలేదని అన్నారు. ఉద్యోగ భద్రత లేక రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా వెట్టి చాకిరి చేస్తుంటే కేంద్ర ప్రభుత్వానికి కనిపించడం లేదన్నారు. దేశం లోని మణిపూర్ రాష్ట్రంలో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగిస్తా ఉంటే అక్కడి ప్రభుత్వానికి కానీ దేశ ప్రధానికి గాని ఏమాత్రం పట్టనట్టుగా ఉన్నారని అన్నారు. అంటే ఈ దేశ మహిళా పౌరుల పట్ల అత్యాచారాలు జరుగుతుంటే చూస్తూ ఉండడమేన దేశభక్తి అని ప్రశ్నించారు. ఇటువంటి అన్యాయాలను ఎదిరించ డానికి మహిళా లోకం యావత్తు ఒక్క తాటిపై నిలబడి పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లవుతున్న ఇంకా ఈ దేశ మహిళలు కనీస వేతనాల కోసం సమ్మెలు చేయాల్సి రావడం సిగ్గుచేటు అన్నారు. మహిళల పట్ల కార్మికుల పట్ల చిత్తశుద్ధి లేని ఈ ప్రభుత్వాలను గద్దెదించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు విక్టోరియా రాణి, రేణుక, లావణ్య, పద్మ, వత్సల, సవిత, గంగామణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేశ్‌బాబు

సాలూరలో కామదహనం

- మంటలు ఎగిసి తెగినపడిన విద్యుత్ వైర్‌లు
- తృటిలో తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-బోధన్





సాలూర మండల కేంద్రంలో బుధవారం గ్రామస్తులు కామదహనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరడమ్మ ఆలయం వద్ద గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్సీ కాలనీలో సాంప్రదాయానికి అనుగుణంగా తమలపాకులు పంపిణీచేసి కాముడికి నిప్పు అంటించారు. గ్రామంలో పలు కాలనీలలో కామదహనాలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకటిపటేల్, జనార్దన్, ఇల్తెపు శంకర్,రవిబాబా, సాయిలు, లక్ష్మణ్(తేజ), స్వామిగౌడ్, రామారావు, బొర్ర గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

కామదహనం సందర్భంగా గైనిలో నిప్పు పెట్టగా పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దాంతో మంటల తాకిడికి విద్యుత్ తీగలు కరిగిపోయి పలువురిపై తెగిపడ్డాయి. నిమిషం క్రితమే జేఎల్‌ఎం చంటి విద్యుత్ సరఫరా నిలిపివేయించడంతో ప్రాణాపాయం తప్పింది.

కంటి సమస్య ఉన్న విద్యార్థులకు కండ్లజోళ్లు అందించాలి

- జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

నవతెలంగాణ-భిక్కనూర్



విద్యార్థులతో కలెక్టర్

కంటి చూపు సమస్యలను పరిశీలించి అవసరమైన వారికి కళ్ల జోళ్లు అందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం భిక్నూర్ మండలం జంగంపల్లి మహాత్మా జ్యోతి రావు పూలే బాలికల రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలలో దృష్టి లోపం కలిగిన విద్యార్థిను లకు కళ్ల జోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిం చారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రీయ బాల స్వస్త్ కార్యక్రమం క్రింద జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. దృష్టి లోపం కలిగిన విద్యార్థులకు కళ్ల జోళ్లను ఉచితంగా అందించనున్నట్టు తెలిపారు. ఈ పాఠశాలల్లో 77 మంది విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు.

అనంతరం రెసిడెన్షియల్ స్కూల్ లోని కిచెన్, స్టోర్ రూం లను కలెక్టర్ పరిశీలించి ప్రభుత్వం జారీ చేసిన కొత్త మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. అనంతరం పదవ తరగతి గదిలో విద్యార్థినులతో మాట్లాడుతూ ఈ నెల 21 నుండి ప్రారంభం అయ్యే వార్షిక పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరచి ఉత్తమ మార్కులను పొందాలని హార్డ్ వర్క్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చంద్రశేఖర్, ఆప్తమాలిస్ట్ డాక్టర్ రవీందర్, ఆర్బి ఎస్కే డాక్టర్ మనోజ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ మహాలక్ష్మి ప్రిన్సిపాల్ విమలా దేవి, తహసీల్దార్ శివ ప్రసాద్, ఎంపీడీఓ రవికిరణ్ పాల్గొన్నారు.

టీయూ పేరు మార్చబోం

- జక్రాన్‌పల్లిలో నవోదయ ఏర్పాటుకు సీఎం సుముఖత
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్/డిచ్‌పల్లి

తెలంగాణ యూని వర్సిటీ పేరు మార్చబోమని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తెలిపారు. అదే విధంగా జక్రాన్‌పల్లిలో నవోదయ ఏర్పాటుకు సీఎం సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి.. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తెలంగాణ యూనివర్సిటీ పేరు మార్పు-జక్రాన్‌పల్లి మండలంలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు పై మాట్లాడినట్టు తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ పేరు మార్పుపై వస్తున్న వివిధ కథనాలను, వివిధ వర్గాల అభిప్రాయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా.. ఈ విషయంలో స్పందించిన సిఎం తెలంగాణ యూనివర్సిటీ పేరు మార్పు లేదని స్పష్టమైన ఆదేశాలు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి శ్రీమతి యోగితా రాణికి జారీ చేసినట్టు తెలిపారు.

అలాగే నిజామాబాద్ జిల్లాకు మంజూరైన నూతన జవహర్ నవోదయ విద్యాలయాన్ని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని జక్రాన్ పల్లి మండలంలో ఏర్పాటు చేయాలని, విద్యాలయం ఏర్పాటుకు గల అనుకూల అంశాలను వివరించగా.. ముఖ్యమంత్రి సానుకూల స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మిషన్ భగీరథ సిబ్బందికి ప్రతి నెల జీతాలు చెల్లించాలి



నినాదాలు చేస్తున్న మిషన్ భగీరథ సిబ్బంది

నవతెలంగాణ-మోర్తాడ్

మిషన్ భగీరథలో పనిచేస్తున్న సిబ్బంది అందరికీ ప్రతి నెల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాలకు చెందిన మిషన్ భగీరథ ఆపరేటర్లు బుధవారం మోర్తాడ్ పంప్ హౌస్ వద్ద ధర్నా నిర్వహించారు. గత కొన్ని నెలల నుండి తమకు జీతాలు అందకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. తొమ్మిది నెలల నుండి మిషన్ భగీరథ ఆపరేటర్స్‌కు, లైన్‌మెన్‌లకు, సూపర్వైజర్లకు జీతాలు చెల్లించకపోవడంతో తమ కుటుంబాలు పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రతి ఒక్కరి లైన్మెన్ కు కావలసిన పనిముట్లను, ఆపరేటర్లకు కావలసిన పనిముట్లను తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టం ప్రకారం మిషన్ భగీరథ ఆపరేటర్స్ లైన్మెన్ సూపర్వైజర్లకు జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ అధికారులు అక్కడ చేరుకొని ఈ నెల చివరి నాటికి మూడు నెలల జీతాలను మంజూరు చేయిస్తామని హామీ ఇవ్వడంతో సిబ్బంది ధర్నాను విరమించారు.

ఘన్‌పూర్ ఐకేపి వీవోఏకు ఘనంగా సన్మానం


వివోఏలను సన్మానిస్తున్న డీఆర్డీఏ సభ్యులు

నవతెలంగాణ-వర్ని

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో డిఆర్డిఏ నిజామాబాద్ జిల్లా సమైక్య ఆధ్వర్యంలో చందూర్ మండలం ఘనపూర్ గ్రామ ఐకేపి విఓఏ ఇందూరు అనును సన్మానించారు. బెస్ట్ ఫర్మామెన్స్ వీఓఏగా గుర్తించి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రసూల్‌బి, డిఆర్డిఓ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందజేశారు. తదుపరి శాలువాతో సన్మానం చేసి అభినందించారు.

పరీక్షా ప్యాడ్స్, పెన్నులు పంపిణీ


ప్యాడ్స్, పెన్నులు అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని మెంట్రాజ్ పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో సీనియర్ ఉపాధ్యాయులు ఆడెపు సుదర్శన్ కోరిక మేరకు సహకార సొసైటీ చైర్మన్ చైర్మన్ చింత శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్, పెన్నులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి ఉత్తీర్ణతతో పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని, ప్రశాంతమైన మనస్సుతో పరీక్షలు పూర్తి చేయాలని, ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ భోదునపు నవీన్, విడిసి సభ్యులు బైరి సాయిలు, రేగుంట శ్రీనివాస్, గుర్రపు రాజేశ్వర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఔషధ, సుగంధ ద్రవ్య మొక్కల పెంపకంతో దేశాభివృద్ధికి అపారమైన అవకాశాలు

- వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరిరావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ కేంద్రియ ఔషధ. సుగంధ ద్రవ్య మొక్కల పరిశోధన కేంద్రం (సి -మ్యాప్) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఔషధ, సుగంధ మొక్కలు, వాణిజ్య పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టీ. యాదగిరిరావు పాల్గొని మాట్లాడుతూ భారతదేశానికి వ్యవసాయ రంగం వెన్నెముకని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ సుస్థిరతతో ముందుకు వెళ్లాలంటే వ్యవసాయ రంగంలో ఔషధ, సుగంధ ద్రవ్య పంటలను వాణిజ్య పంటలుగా అభివృద్ధి చేయాలన్నారు. వ్యవసాయ రంగంలో క్షేత్రస్థాయిలో నూతన వినూత్న మార్పులను ఆవిష్కరిస్తూ సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులను తగ్గిస్తూ సుగంధ ద్రవ్యాలు మరియు వాణిజ్య పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. రైతులు ఉత్పత్తిని గణనీయంగా పెంచి వాణిజ్య పంటల ఎగుమతిలో అంతర్జాతీయంగా భారతదేశాన్ని కీలకమైన స్థానంలో నిలబెట్టాలన్నారు. సుగంధ ద్రవ్యాల సాగులో అధిక ఆదాయంతో పాటు సులభతరమైన మార్కెట్ సౌకర్యం కలిగి ఉన్నదని పేర్కొన్నారు. ఔషధ వాణిజ్య పంట సాగు చీడపీడలకు దూరంగా ఉంటుందని, నీటి వినియోగం తక్కువుగా ఉంటుందని, క్రిమి కీటకాలు ఆశించవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. యాదగిరి మాట్లాడుతూ రైతులు విశ్వవిద్యాల యాలకు వచ్చి శాస్త్రవేత్తలతో, అధ్యాపకులతో అనుభవాలు పంచుకోవడం వల్ల వ్యవసాయ రంగంలో గుణాత్మకమైన మార్పులు వస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లి వ్యవసాయ విధివిధానాలను తెలుసుకొని పరిశోధనలు చేసినట్లయితే విప్లవత్మకమైన మార్పులు వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర ఔషధ, సుగంధ ద్రవ్య మొక్కల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డా. జ్ఞానేష్ ఎసి మాట్లాడుతూ ఔషధ, సుగంధ మొక్కల సాగు వలన రైతులకు ఆర్థిక ప్రయోజనాలతో పాటు ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. వీటి సాగుతో పంటలు తెగుళ్లు, వ్యాధులకు గురికాకుండా నివారించవచ్చన్నారు. ఈ సాగులో ఉత్పత్తికి పరిశ్రమలతో అనుసంధానించడానికి మార్కెటింగ్, సరఫరా గొలుసు నిర్వహణ కలిగి ఉందని పేర్కొన్నారు. ఈ సాగుతో అంతర్జాతీయ ఎగుమతులు పెరిగి దేశాభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉన్నత్ భారత్ అభియాన్ ప్రాజెక్ట్ మరియు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ వాసం చంద్రశేఖర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో మండలం లోని రైతులు హాజరై శాస్త్రవేత్తలతో అనేక వ్యవసాయ రంగ ఉత్పత్తులకు సంబంధించిన అనుమానాలను నివృత్తి చేసుకొని నిమ్మ గడ్డి, కాషా గడ్డి మొక్కలను తీసుకున్నారు. కార్యక్రమంలో సహ సమన్వయకర్తలుగా డాక్టర్ మావురపు సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ శిరీష బోయపాటి, డాక్టర్ ఏ పున్నయ్య, డాక్టర్. నాగరాజు, డాక్టర్. నాగరాజు పాత,డాక్టర్ సాయిలు, డాక్టర్ గంగా కిషన్, డాక్టర్ కిరణ్ రాథోడ్, డాక్టర్ నర్సయ్య, డాక్టర్ శరత్, ప్రొఫెసర్ అపర్ణ, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ మహేంద్ర ఐలేని సీనియర్ టెక్నీషియన్ వై వి వి ఎస్ స్వామి తదితరులు పాల్గొన్నారు.


రైతకులకు అవగాహన కల్పిస్తున్న వైస్ ఛాన్సలర్


పాల్గొన్న రైతులు

'వెల్‌నెస్ సెంటర్‌కు చికిత్స చేయాలి'

- కలెక్టర్‌కు ఆల్ పెన్షనర్స్ సంఘం విజ్ఞప్తి


కలెక్టర్‌కు విన్నవిస్తున్న పెన్షనర్స్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టుల కోసం ఏర్పాటుచేసిన ఈ .హెచ్. ఎస్. వెల్నెస్ సెంటర్ కు అదనపు గదులు కేటాయించి అన్ని సేవలు అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని బుధవారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కి బుధవారం వినతి పత్రం అందజేశారు. స్పందించిన జిల్లా కలెక్టర్ అదనపు గదులు కేటాయించేందుకు, లబ్ధిదారులకు ఎండాకాలంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అదనంగా షెడ్డును నిర్మించాలని కార్పొరేషన్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా వెల్నెస్ సెంటర్లో మందుల సరఫరా, ఇతర సేవలకు ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, వెంటనే ఫార్మసిస్టులను నియమించాలని, విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన వెల్నెస్ కో-ఆర్డినేటర్ కృష్ణవేణికు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు కే రామ్మోహన్రావు, జిల్లా నాయకులు శిర్ప హనుమాన్లు, ప్రసాదరావు, రాధకిషన్ ఉన్నారు.

విద్యార్థులకు డిజిటల్ తరగతులు



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు డిజిటల్ తరగతులను నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు గిరిధర్ బుధవారం తెలిపారు. విద్యార్థులకు సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయులు స్మార్ట్ టీవీ ద్వారా బోధిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ తరగతుల వల్ల విద్యార్థులు సులభంగా నేర్చుకుని దీర్ఘకాలం గుర్తుంచుకుంటారన్నారు. తెలుగు, ఆంగ్లం, గణితం పాఠాలను డిజిటల్ తరగతుల ద్వారా చెప్పడం వల్ల విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరుగుతుందన్నారు. డిజిటల్ తరగతుల వల్ల బడి మానేసే పిల్లలసంఖ్యను తగ్గించేందుకు ఆస్కారం ఉంటుందని వివరించారు. డిజిటల్ తరగతులు నిర్వహణ వల్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మాసం శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వేలం పాట


వేలం పాటలో పాల్గొన్న ఆలయకమిటీ సభ్యులు

నవతెలంగాణ-ఎడపల్లి

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జానకంపేట గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలికులు కమల, కార్య నిర్వహణ అధికారి ఆలయం (ఈవో) గుంజుపల్లి వేణు ఆధ్వర్యంలో బుధవారం వేలంపాట నిర్వహించారు. ఈనెల 25న అమావాస్య పర్వదినం సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చిరు వ్యాపారులు కొబ్బరికాయలు నవధాన్యాలు, పులిహోర, సైకిల్ స్టాండ్ పార్కింగ్ నిర్వహణ కొరకు వేలంపాట నిర్వహించినట్లు ఆలయ ఈవో వేణు తెలిపారు. నిజామాబాద్ పట్టణానికి చెందిన నితిన్ 44వేలకు వేలం దక్కించుకున్నారు. అలాగే లడ్డు పులిహోర విక్రయించేందుకు నిజామాబాద్ పట్టణవాసి సురేష్ అనే వ్యక్తి 42 వేల ఐదు వందల రూపాయలతో వేలం దక్కించుకున్నారు. సైకిల్ స్టాండ్, పార్కింగ్ నిర్వహణ కొరకు పాడిన వేలంపాటలో జానకంపేట వాసి మనోజ్ కుమార్ 5,100 రూపాయలతో దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ రఘు, చిరు వ్యాపారులు జానకంపేట గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

ప్యాడ్, జామెట్రీ బాక్స్, ఇంగ్లీష్ డిక్షనరీల అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

వర్ని రోడ్డోగల బీబీసీ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు లయన్ సహారా ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్, జామెట్రీ బాక్స్, ఇంగ్లీష్ డిక్షనరీలను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ సూర్య భగవాన్ మాట్లాడుతూ.. పరీక్షలు అంటే భయం లేకుండా రాయాలని, పాఠ్యాంశా లపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మార్కుల కోసం కాకుండా మంచిగా చదువుకొని జ్ఞానాన్ని పెంచుకోవాలని కోరారు. లయన్స్ సేవలను రానున్న కాలంలో మరింత పెంచుతామన్నారు. కార్యక్రమంలో లయన్స్ నరసింహారావు, లయన్స్ ధనుంజయ రెడ్డి, లయన్స్ ప్రవీణ్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు అరుణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

సాయిబాబా దేవస్థానం మాధవ నగర్ నిజామాబాద్‌లో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయ రామారావు ఆధ్వర్యంలో బుధవారం హుండీలు లెక్కించారు. మూడు నెలల రెండు రోజులకు గానూ. మొత్తం రూ..3లక్షల700 వచ్చాయని తెలిపారు. ఈకార్యక్రమంలో కార్య నిర్వహణ అధికారి శ్రీరామ్ రవీందర్, మాణిక్య శర్మ హరి, శర్మ, పూజారి, హరిత, జూనియర్ అసిస్టెంట్, సోమయ్య, సంతోష్ కుమార్, భక్తులు, తదితరుల

హామీల అమలుకు అంగన్‌వాడీల సమ్మె

- 17,18వ తేదీల్లో జయప్రదం చేయాలని సిఐటియు పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు జరపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17, 18 తేదీల్లో రాష్ట్ర వ్యాప్త సమ్మెకు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నిర్ణయించిందని ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఐసిడిఎస్ పిడి ఆఫీసులో సూపరింటెంట్‌కు బుధవారం నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ రమేష్ బాబు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే పద్ధతుల్లో నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి అమలు చేయాలని చూస్తుందని అన్నారు.

శ్రీ పథకం ద్వారా ఐసిడిఎస్‌ను నష్టం చేసే విధానాలను ముందుకు తీసుకుపోతుందని, వీటిని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించకపోవడం దురదృష్టకరమని కేంద్ర విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు జరపాలని చూస్తుందని ఆయన విమర్శించారు. ఎన్నికల కన్నా ముందు రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 24 రోజుల సమ్మె సందర్భంగా అంగన్వాడీ టీచర్లకు కనీస వేతనాలు అమలు జరుపుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని పిఎఫ్ సౌకర్యాన్ని అమలు జరుపుతామని హామీ ఇచ్చి 15 నెలలు గడిచినప్పటికీ వాటి అమలుకు చర్యలు చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమావేశాల్లో నిధులను కేటాయించాలని ఐసిడిఎస్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి స్వర్ణ, వాణి, రాజ్యలక్ష్మి లావణ్య పద్మ తదితరులు పాల్గొన్నారు.


నోటీసు అందజేస్తున్న సిఐటియు నాయకులు

డీహైడ్రేషన్‌కు గురికాకుండా నీటిని అధికంగా తీసుకోవాలి

- వైద్యాధికారి సుశాంత్ రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి


వేసవికాలంలో డీహైడ్రేషన్‌కు గురికాకుండా విద్యార్థులు నీటిని అధికంగా తీసుకోవాలని ఇందల్ వాయి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి సుశాంత్ రెడ్డి అన్నారు. మహాత్మా జ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాల ధర్మారంలో బుధవారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, చేతులు కడుక్కునే విధానంపై మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు జ్వరం, జలుబు, దురద లాంటి చిన్న వ్యాధులతో బాధపడితే మందులు అందజేశామని వివరించారు. పరీక్షల సమయంలో ఒత్తిడిని నివారించుటకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. డీహైడ్రేషన్‌కు గురైతే ఓఆర్ఎస్ ద్రావణంను తాగాలని సూచించారు. ప్రతి విద్యార్థి వాటర్ బాటిల్ దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ఆహారం తీసుకునే ముందు మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు.కార్యక్రమంలో ఎం.ఎల్.హెచ్.పి డాక్టర్ మానస, రాజేందర్, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ ఉపాధ్యాయులు ఆశా కార్యకర్తలు భువనేశ్వరి పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు నాణ్యమైన తునికాకు ఇవ్వాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బీడీలు చుట్టే కార్మికులకు నాణ్యమైన తునికాకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) ఆధ్వర్యంలో బుధవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని శివాజీ టెలిఫోన్ మేనేజర్లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి కిషన్ మాట్లాడుతూ నాసిరకం తునికాకు ఇవ్వడం వల్ల కార్మికులను తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. వెయ్యి బీడీలకు ఇస్తున్న ఆకు కేవలం 600 మాత్రమే బీడీలకు సరిపోతుందన్నారు. మిగతా ఆకును కార్మికులు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా చేయడం వల్ల కార్మికులు నెలకు సుమారు 2000 రూపాయలు ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించారు. యాజమాన్యం మొండి వైఖరి విడనాడి వెయ్యి బీడీలకు సరిపడా నాణ్యమైన తునికాకు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో కార్మికులతో ఫ్యాక్టరీని స్తంభింప చేస్తామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో (టియుసిఐ) జిల్లా నాయక్ మురళి, గణేష్, శ్రీధర్, రఘు, గోవర్ధన్, సాయిలు , నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ప్రారంభి ంచినట్లు డిఎం రవికుమార్ తెలిపారు. స్థానికుడైన ఎడ్డి రాజేశ్వర్ తండ్రి రెడ్డి పెద్ద రాజన్న స్మారకార్థం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని అందించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి ముందుకొచ్చిన ఎడ్డి రాజేశ్వరరావు అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఎస్సై విక్రం, ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులు పాల్గొన్నారు.

వంటగదిని శుభ్రంగా ఉంచాలి

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనం తయారు చేసే వంటగదిని శుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని చౌట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. వంటగదిని పరిశీలించిన ఆయన పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని తయారు చేయాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. మెనూప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. పాఠశాలకు సరఫరా చేసిన సరుకులను తనిఖీ చేశారు. వంటగది తో పాటు పరిసరాలను, వంట పాత్రలను శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతమైన పాఠశాలలో రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, వారి పనితీరును పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. పదవ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు అయ్యేవరకు ఉద్యోగ నియామకాలు ఆపాలి

- మాలల ఒత్తిడికి తలొగ్గిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ రెండవ రోజుకు నిరసన దీక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

వర్గీకరణ చట్టం అమలు అయ్యేంతవరకు ఉద్యోగ నియామకాలు ఆపాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ అన్నారు. బుధవారం ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలు చెయ్యకుండా ఉద్యోగ నియామకాలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం యొక్క తీరును నిరసిస్తూ జరుగుతున్న నిరసన దీక్షలు రెండవ రోజుకు చేరుకున్నాయని ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాలల ఒత్తిడికి తలొగ్గి మాదిగలను మోసం చేస్తున్నాడని, దీనికి సాక్ష్యం నిండు అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలు మీద నిలబడకపోవడమేనని అన్నారు. మాదిగల మీద ప్రేమ ఉన్నది అంటూనే ఇంకో వైపు ఉద్యోగ నియామకాలు జరపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకునే రోజు అతి దగ్గర్లో ఉందని హెచ్చరించారు. దీక్షలో ఎంఎంఎస్ జాతీయ నాయకులు యమున, సత్తెక్క, విహెచ్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రొడ్డ ప్రవీణ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షులు మహేష్ మాదిగ, ఎంఎస్పి జిల్లా నాయకులు రామచందర్ మాదిగ, ఎంఈఎఫ్ నాయకులు నాగరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఎల్లయ్య మాదిగ, ఎంఎంఎస్ జిల్లా నాయకురాలు స్వప్న మాదిగ, ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ రూరల్ మండల అధ్యక్షులు కర్కా సాయిలు మాదిగ, ఆరేపల్లి సాయిలు మాదిగ తదితరులు పాల్గొన్నారు..

మాజి సర్పంచుల ముందస్తు అరెస్టు

నవతెలంగాణ-ఎడపల్లి.

మండల తాజా మాజీ సర్పంచులను బుధవారం ఎడపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సర్పంచులుగా కొనసాగిన క్రమంలో గ్రామాభివృద్ధికి వెచ్చించిన వ్యయాన్ని మంజూరు చేయడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం వహిస్తున్న నేపథ్యంలో మాజీ సర్పంచ్ల సంఘం ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈనేపథ్యంలో వారిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో తాజా మాజీ ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, కుర్నా పల్లి తాజా మాజీ సర్పంచ్ దుబ్బాక సావిత్రి రవీందర్ గౌడ్ తదితరులున్నారు.

విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జంబి హనుమాన్ ప్రాంగణం వద్ద ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఆపరేషన్ సబ్ డివిజన్ బుధవారం ఆధ్వర్యంలో "విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీజీ ఎన్‌పిడిసిఎల్, సిజిఆర్ఎఫ్ చైర్మన్ ఎరుకల నారాయణ హాజరయ్యారు. వినియోగదారుల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ రుసుం 25శాతం తగ్గింపు

నవతెలంగాణ-మోర్తాడ్

ఎల్ఆర్ఎస్ రుసుంకోసం ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకున్న వారికి 25శాతం తగ్గింపు రుసుం ప్రభుత్వం కల్పిస్తున్నట్లు ఎంపీఓ శ్రీధర్ బుధవారం తెలిపారు. మండలంలో 100 పైగా దరఖాస్తులు రావాల్సి ఉన్నప్పటికీ కేవలం 10లోపు మాత్రమే దరఖాస్తులు చేసుకొని ఎల్ఆర్ఎస్ డబ్బులు కట్టినట్లు తెలిపారు. డబ్బులు కట్టి ఎల్ఆర్ఎస్ ద్వారా తమ ప్రాపర్టీ అనుమతులు పొందాలని తెలిపారు. 25శాతం తగ్గింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తమ ప్లాట్లు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

చందూర్‌లో గిరిజనుల హోళి సంబరాలు

నవతెలంగాణ-వర్ని (చందూర్)

కరేగాం తాండ గిరిజనులు వారి సంప్రదాయం ప్రకారం హోళి పండగ సందర్భంగా బుధవారం మండలకేంద్రంలో హోలీ సంబరాలు నిర్వహించారు. కోలాటలు ఆడి, కామదేను పండగను జరుపుకొన్నారు. సారాగం రోజున గిరిజనులు పండగను ఆట పాటలతో కొనసాగుతుందని గ్రామ మాజీ సర్పంచ్ దేవి సింగ్ తెలిపారు.

శ్రీవేద హైస్కూల్‌లో విజ్ఞాన ప్రదర్శన


విద్యార్థుల ప్రయోగాలు ప్రదర్శన

నవతెలంగాణ-పోతంగల్(కోటగిరి)

కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ వేద హైస్కూల్ లో బుధవారం విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎంఇఓ శ్రీనివాస రావు విద్యా ర్థుల ప్రదర్శనలు తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విజ్ఞాన ప్రదర్శనలు, విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఎంతో ఉపయో గపడతాయన్నారు. శాస్త్ర, సాంకేతిక, గణితం అంశాలపై కూడా పట్టు సాధించా లన్నారు. అనంతరం ఎంఇఓను సత్కరించారు. కార్యక్రంలో, రవీందర్, పాఠశా ల కరెస్పాండంట్ రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ షెడ్ నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని అమీర్ నగర్ గ్రామంలో పౌల్ట్రీ షెడ్ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి ముఖ్యఅతిథిగా పాల్గొని పౌల్ట్రీ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో పౌల్ట్రీ షెడ్ నిర్మాణానికి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.3 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో పౌల్ట్రీ షెడ్ నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. పౌల్ట్రీ షెడ్ నిర్మాణం పూర్తయితే వేసవిలో పశువులు సేద తీరేందుకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. పౌల్ట్రీ షెడ్ నిర్మాణం పనులు త్వరగా పూర్తయ్యేలా స్థానిక కాంగ్రెస్ నాయకులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీలత, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ ఆడిచర్ల అరవింద్, ఫీల్డ్ అసిస్టెంట్లు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
3
గురువారం | మార్చి 13, 2025 | www.navatelangana.com

పది విద్యార్థులకు వీడ్కోలు


వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-నిజాంసాగర్

మహ్మద్ నగర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల యందు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం బుధవారం నిర్వహించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రాజ్ తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి కూడా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మంచిగా రాయాలని, పాఠశాల ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను గ్రామస్తులు అందించారు. కార్యక్రమంలో మహ్మద్ నగర్ మండల విద్యాధికారి అమర్ సింగ్ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆర్డీవోకు సన్మానం



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి ఆర్‌డిఓగా నూతన పదవి బాధ్యతలు స్వీకరించిన కే.వీణ. (డిప్యూటీ కలెక్టర్) ని కామారెడ్డి డివిజన్ పరిధిలోని ఆయా మండలాల తహసీల్దార్‌ల సమక్షంలో సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం, జిల్లా ప్రతినిధులు ఆర్డీవో ను శాలువాతో సత్కరించి మెమోంటో అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్షులు సిర్నాపల్లి ప్రదీప్ కుమార్, కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం వి భాస్కర్, కామారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు షబానా బేగం, జిల్లా ప్రతినిధులు అన్వర్ గౌరీ,ఎస్, జమున,అస్మా తదితరులు పాల్గొన్నారు.

మారనున్న టోల్ ప్లాజా స్థలం..!

- శాశ్వత స్థలంలో ఏర్పాటుకు సన్నాహాలు

నవతెలంగాణ-భిక్కనూర్

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రెండు టోల్ ప్లాజాలు ఉన్నాయి. ఒకటి ఇందల్వాయి దగ్గర, మరొకటి భిక్కనూర్ పట్టణ శివారులో ఉంది. ఇందల్వాయి టోల్ ప్లాజా శాశ్వత టోల్ ప్లాజా కాగా భిక్కనూర్ టోల్ ప్లాజా తాత్కాలికంగా 15 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గత నెల రోజుల క్రితం నుంచి నూతన కాంట్రాక్టర్ టోల్ ప్లాజాను 30 సంవత్సరాల వరకు కాంట్రాక్ట్ దక్కడంతో టోల్ ప్లాజాను శాశ్వతంగా ఏర్పాటు చేయడానికి ప్రస్తుతం ఉన్న చోటు నుంచి మరోచోటికి మార్చడానికి స్థలాన్ని పరిశీలిస్తున్నట్టు సమాచారం.

ప్రస్తుతం ఉన్న టోల్ ప్లాజాలు పూర్తిస్థాయి సౌకర్యాలు లేకపోవడం, రహదారి అస్తవ్యస్తంగా ఉండడం, ఇతర సమస్యల కారణంగా ఇబ్బంది దృష్టిలో ఉంచుకొని వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎక్కువ బూత్‌లు ఏర్పాటుచేసి ఆటోమేటిక్ గేట్ ఓపెన్, అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. టోల్ ప్లాజాను ప్రస్తుతం ఉన్న చోటు నుంచి మరో చోటికి మార్చడానికి స్థలం సమస్య కారణమైతే భిక్కనూర్ మండలంలోని వాహనాలు సమస్య కారణంగా ఉంది. వాహనదారులు సైతం టోల్ ప్లాజాలో సౌకర్యాలు లేవని, ఇబ్బందికరంగా రోడ్లు ఉన్నాయని, తక్కువ బూతుల కారణంగా ఎక్కువ సమయం టోల్ బూత్ దాటడానికి సమయం పడుతుందని వంటి కారణాల వలన స్థలాన్ని మారిస్తే అన్ని సమస్యలు పరిష్కారం ఉంటుందని ఆలోచిస్తున్నట్లు తెలిసింది.



టోల్ ప్లాజాను ప్రస్తుతమున్న చోటి నుండి మరో చోటికి మారిస్తే బిక్కనూరు మండలం వాహనాలు తప్పనిసరిగా పాస్ తీసుకునెందుకు టోల్ ప్లాజా యాజమాన్యం సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. పూర్తిస్థాయిలో అన్ని సౌకర్యాలతో టోల్ ప్లాజాను నిర్మించి జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ఆటోమెటిక్ గేట్లు ఓపెన్ క్లోజ్ కావడం, సిబ్బందిని సైతం తగ్గించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఉన్న చోటు నుండి ఒక కిలోమీటర్ దూరంలో ఎక్కువ టోల్ బూతులతో ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. శాశ్వత టోల్ ప్లాజా ఏర్పాటు చేసిన తర్వాత అయినా నిత్యం వాహనదారులతో గొడవలు జరుగుతున్న సమస్య పరిష్కారం అవుతుందా వేచి చూడాల్సి ఉంది.

కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు

నవతెలంగాణ-రామారెడ్డి/తాడ్వాయి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగాయి. గణితం, వృక్షశాస్త్రం, సివిక్స్ పరీక్షలు నిర్వహించారు. 150 మంది విద్యార్థులకు గాను 148 మంది విద్యార్థులు హాజరై ఇద్దరు విద్యార్థులు గైహాజరయ్యారు.

తాడ్వాయి : మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు ప్రిన్సిపల్ బి.సురేఖ బుధవారం తెలిపారు. బాటని, సివిక్స్, పరీక్షలకు మొత్తం విద్యార్థులు 210 ఉండగా 3 గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించామని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

యూనివర్సిటీ పేరు మార్చే ఆలోచన తగదు

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ యూనివర్సిటీ పేరు మార్చే ఆలోచన విరమించుకోవాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు, టీయూ పూర్వ విద్యార్థి నీల నాగరాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ విశ్వవిద్యాలయం పేరును మార్చి ఈశ్వరీబాయి యూనివర్సిటీగా మార్చాలనే ప్రక్రియను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. ఉన్నత విద్యామండలి నుండి వచ్చిన ప్రతిపాదనను వర్సిటీ అధికారులు తిరస్కరించాలన్నారు. తెలంగాణ ఉద్యమకాలంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం మాదిరిగా తెలంగాణలో కూడా ఉండాలని ఉమ్మడి జిల్లా ప్రజల కోరిక మేరకు విశ్వవిద్యాలయానికి తెలంగాణ పేరు పెట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్, రంజిత్, సత్యం, మధు, అరవింద్,దరాంసింగ్, ఈశ్వర్,శ్రీరామ్,రాజు తదితరులు పాల్గొన్నారు.

తాజా మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు


ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ-లింగంపేట్

తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలని రాష్ట్ర సర్పంచుల ఫోరం కమిటీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చింది. కాగా బుధవారం లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు మాజీ సర్పంచులను ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించినట్టు ఎస్సై వెంకట్ రావు తెలిపారు.

రెండవ రోజుకు చేరిన మాదిగల రిజర్వేషన్ పోరాట సమితి దీక్ష

నవతెలంగాణ-కామారెడ్డి

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి చేపట్టిన దీక్ష బుధ వారం రెండవ రోజుకు చేరుకుంది. ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చినారనీ, ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా మాలలకు తొత్తుగా పని చేస్తూ గ్రూపు 1, గ్రూపు 2, గ్రూపు 3 నియమకాలకు ఆదే శాలిస్తూ వర్గీకరణను అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకొని వర్గీకరణ చేసిన తర్వాతనే గ్రూప్ వన్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు సత్తి గారి లక్ష్మీ, కామారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు కొత్తల్ల యాదగిరి, కామారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు కొత్తూరు సాయిలు, కామారెడ్డి జిల్లా వికలాంగుల అధ్యక్షులు కోల బాలరాజ్ గౌడ్, రాష్ట్ర వికలాంగుల ఉపాధ్యక్షురాలు నల్లబల్ల సుజాత, కామారెడ్డి జిల్లా నాయకులు నయీముద్దీన్, జమాల్ భాయ్, సదాశివ నగర్, మండల్ వికలాంగుల అధ్యక్షులు నా రెడ్డి, నల్లబల్ల నాగరాజు, నాగమణి మాదిగ తదితరులు పాల్గొన్నరు.


దీక్షలో పాల్గొన్నా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సభ్యులు

వికలాంగుల హక్కు పోరాట సమితి మద్దతు

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేస్తున్న నిరాహార దీక్షకు వికలాంగుల హక్కుల పోరాట సమితి మద్దతు తెలుపుతుందని జిల్లా అధ్యక్షులు కోల బాల రాజు అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఎంఆర్పిఎస్ నాయకులు చేస్తున్న దీక్షకు తాము పూర్తి మద్దతు పలికారు. గ్రూప్ 1,2,3 ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా నాయకులు సుజాత, నైముద్దీన్, జమీలుద్దీన్, రాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభ్యాసన సామర్థ్యాల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యాధికారి

నవతెలంగాణ-పిట్లం

కనీస అభ్యాసన సామర్థ్యాల స్థాయి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల విద్యాధికారి దేవి సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని గౌరారం పాఠశాలలో నిర్వహిస్తున్న కనీస అభ్యాసన సామర్థ్యాల స్థాయిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ ఐడి జనరేట్ వందశాతం అయ్యేవిధంగా చూడాలన్నారు. హెల్ప్ లైన్ నంబర్లను పాఠశాల ఆవరణలో డిస్ ప్లే అయ్యేవిధంగా చూడాలన్నారు. పాఠశాల సిబ్బంది సివిల్ లిస్టు, ఫోటోలతో సహా ప్రదర్శించాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించి, క్లాస్ రూమ్ లను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ సిబ్బంది కృషా రెడ్డి, ధనుంజయ్, ఎల్లయ్య, సంధ్యారాణి, ఎం సంధ్య, మణి, ఇన్విజిలేటర్ జగదీష్ ఆ ప్రాంత సి ఆర్ పి గోపాల్ సింగ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా క్రాంతి పథం మండల కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-పిట్లం

మండల ఇందిరా క్రాంతి పథం నూతన కార్యవర్గాన్ని ఎలక్షన్ ఆఫీసర్‌గా ఏపీఎం రామ్ నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం సమాఖ్య జనరల్ బాడీ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలిగా నాగమణి (బోల్లక్ పల్లి), కార్యదర్శిగా శ్యామల (బుర్నాపూర్) కోశాధికారిగా హర్షియా ఫాతిమా (పిట్లం)తోపాటు పాటు ఈసీ సభ్యులను ఎన్నుకున్నట్లు రామ్ నారాయణ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమైఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కార్యవర్గం

నవతెలంగాణ-రాజంపేట్

రాజంపేట్ మండల మహిళా సమైక్య నూతన కార్యవర్గాన్ని బుధవారం స్థానిక ఐకెపి కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా సమైక్య అధ్యక్షురాలిగా సుతారి లక్ష్మీ, కార్యదర్శిగా లత, కోశాధికారిగా లావణ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం రమేష్ బాబు, ఏపీఎం సాయిలు మహిళా సమైక్య సభ్యులు ఉన్నారు.

సీఎంఆర్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని నందివాడ, ఎర్రపాడు, గ్రామాల్లో సీఎంఆర్ చెక్కులు పంపిణీ చేసినట్టు అధికార ప్రతినిధి మహమ్మద్ షౌకత్ అలీ బుధవారం తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గైని రాజలింగం, సమన్వయ కమిటీ నాయకులు దేవిరెడ్డి, జలంధర్ రెడ్డి, తిప్పారపు మోహన్‌రెడ్డి, సాయగౌడ్, కే.నరేందర్‌రెడ్డి, బక్క గణేష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్లో... స్వయంపాలన దినోత్సవం


టీచర్లుగా మారిన విద్యార్థులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని గోలి లింగాల గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం ఘనంగా బుధవారం జరుపుకున్నారు. ఎనిమిదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ప్రధానోపాధ్యాయులుగా భరత్, ఉపాధ్యాయులుగా లహరి, కేశవర్ధన్, భార్గవి, సహస్ర, భవాని, దివ్య, పిఈటీ చరన్ విధులను నిర్వర్తించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేవయ్య, ఉపాధ్యాయులు ఆంజనేయులు, చంద్రమోహన్, వినీల్, శార్వాణి పాల్గొన్నారు.

భయం వీడితేనే విజయం


మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ రామోదర్‌రెడ్డి

నవతెలంగాణ-సదాశివనగర్/రాజంపేట్

సదాశివనగర్ ఉన్నత పాఠశాలలో మండల నోడల్ ఆఫీసర్ దామోదర్ రెడ్డి ఆర్థిక సహాయంతో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ తరపున కెరియర్ గైడెన్స్ - విజయ స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పరీక్ష కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు దయానంద్, జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధం కావాలని, భయం వీడితేనే విజయం సాధిస్తామని తెలిపారు. మన చుట్టూ ఎంతోమంది విజయం సాధించిన వారి నుండి స్ఫూర్తిని పొంది, వైఫల్యం పొందిన వారి నుండి గుణపాటాన్ని నేర్చుకొని సమాజంలో ఉన్నత స్థాయికి చేరి దేశ సేవలో ముందుండాలని సూచించారు.

అనంతరం పదవ తరగతి తర్వాత ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల గురించి తెలిపే పోస్టర్‌ను విడుదల చేసి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా మండల నోడల్ ఆఫీసర్ ముఖ్య అతిథి దామోదర్ రెడ్డి, పిఆర్టియు మండల ప్రధాన కార్యదర్శి బసంత్ రాజ్ మాట్లాడుతూ హెల్పింగ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ చేస్తున్న సేవలు అమోఘమని కొనియాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో సత్ప్రవర్తనను కలిగిస్తాయని, సూచించే సూచనలు పరిగణలోకి తీసుకొని ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు దయానంద్, జైపాల్ రెడ్డి, కృష్ణకార్‌రావు విద్యార్థులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్...

రాజంపేట్ : రాజంపేట్ మండలంలోని తలమడ్ల హైస్కూల్లో హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ తరుపున పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్- విజయ స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఏఎస్ఐ సుభాషిని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని మానసిక ప్రశాంతతో చదివితే చదివిన అన్ని అంశాలు గుర్తుంటాయని పరీక్షల పట్ల భయాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అనంతరం హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు అన్వేషరావు, ప్రసాద్ రావు మాట్లాడుతూ పదో తరగతి తరువాత ఉన్నత విద్య ఉద్యోగ అవకాశాలు పూర్తిగా వివరించడం జరిగింది. ప్రతి విద్యార్థి చత్రపతి శివాజీ స్ఫూర్తితో జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ సంస్థ ద్వారా ఎంత మంది విద్యార్థులకు ఉన్నత చదువులు చదవడానికి లేక విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుంది. జూగంటి అనిల్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

నల్ల పోచమ్మ జాతర పనుల పరిశీలన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని గోపాల్పేట గ్రామంలో నిర్వహించే నల్ల పోచమ్మ జాతర పనులను ఆలయ కమిటీ చైర్మన్ హనుమంత్ రెడ్డి, స్థానిక ఎస్సై మల్లారెడ్డి బుధవారం పరిశీలించారు. ఎడ్లబండ్ల తిరుగు విధి విధానాల గురించి ఎస్సై ఆలయ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఫరీద్, లక్ష్మీకాంతం, వంశి గౌడ్, వెంకట్ రెడ్డి, సంతోష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

కార్యదర్శులతో సమీక్ష


సమీక్షలో మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని 30 గ్రామ పంచాయతీల కార్యదర్శులతో, ఉపాధి హామీ సిబ్బంది తో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులు సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్ , ఎంపీ ఓ రాము , ఏపీవో తులసీరామ్, ఈసీ స్వామి దాస్ సమావేశానికి హాజరైన ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ కార్యదర్శిల ని ఉద్దేశించి మాట్లాడారు.

లేబర్ టర్నోవర్, నర్సరీలలో మొక్కల పెంపకం, మంచినీటి నిర్వహణ, పారిశుధ్యం, కంపోస్ట్ నిర్వహణ, గృహలక్ష్మి, ఎల్ఆర్ఎస్ పేమెంట్ ఫోన్ కాల్స్ 25 శాతం రిబేట్ గురించి చర్చించారు. ఇట్టి విషయాలలో అశ్రద్ధగా ఉండకుండా, శ్రద్ధగా పనిచేయాలని ప్రజలకు దగ్గరగా అవ్వాలంటే నిత్యం ప్రజలతో మమేకమై ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ టిఏలు రవీందర్, అశోక్ గౌడ్ , ఎఫ్ఏలు, మండలంలోని వివిధ గ్రామాల గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండల పరిధిలోని ఎనబోరా రాచన్న దేవాలయం నుంచి కొలనుపాక శ్రీ సోమేశ్వర ఆలయానికి జుక్కల్ నియోజకవర్గం, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పాదయాత్రగా బుధవారం వెళ్లారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు వారితో కలిసి పాదయాత్రలో పాల్గొని సోమేశ్వర ఆలయాన్ని, రేణుకా చారిలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలి

- కామారెడ్డి ఎస్‌హెచ్ఓ చంద్రశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రయాణికులతో ఆటో డ్రైవర్లు మర్యాదగా ప్రవర్తించాలని అప్పుడే ప్రయాణికులు తమ సేవలను గుర్తిస్తారని కామారెడ్డి ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం కామారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్ పై, ప్రయాణికులతో వ్యవహరించే విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎప్పుడూ ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించవద్దని వారికి గౌరవమిచ్చి మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం



నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలో ఇటీవల రోడ్డు ప్రమాదం లో మృతిచెం దిన కీసర మైసయ్య కుటుంబాన్ని ఆదుకుంటా మని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదనమోహనన్ రావు అన్నారు. మంగళవారం రాత్రి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ మృతుని కుమారునికి ఔట్సోర్సింగ్ డ్రైవర్ ఉద్యోగం నియమించేందుకు కృషి చేస్తామన్నారు. విద్యుత్ షాక్‌కు గురై హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొంది వచ్చిన మర్రి రవిని పరామర్శిస్తూ ఆస్పత్రిలో ఆయన ఖర్చులను ప్రభుత్వం ద్వారా రూ.5లక్షల వరకు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ బండారు సంజీవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబిర్ శ్యామ్ రావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు, మాజీ ఉప సర్పంచ్ సంతాజి గారి సుధాకర్ రావు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల యువ ఎక్స్ఛేంజ్ విజయవంతం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కంఠేశ్వర్

కేంద్ర యువజన క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర, మేర యువ భారత్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే అంతర్ జిల్లాల యువ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం నిజామాబాద్ జిల్లాలోని డిచ్‌పల్లిలో గల ఎస్బిఐ ట్రైనింగ్ సెంటర్లో విజయవంతంగా పూర్తయింది. హైదరాబాద్ జిల్లాకు చెందిన ఎంపిక చేయబడిన 30 మంది యువతీ యువకుల బృందం ఐదు రోజులపాటు నిజామాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాలలోని చారిత్రాత్మక ప్రదేశాలు, కర్మాగారాలు ఇతర దర్శనీయ స్థలాలను సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేశారు. మార్చి 8న ప్రారంభమైన ఈ కార్యక్రమం మానసిక శారీరక శిక్షణ కార్యక్రమాలతో పాటు నిజామాబాద్ కామారెడ్డి జిల్లాలోని ప్రఖ్యాత దర్శనీయ స్థలాల సందర్శన, నిజామాబాద్ నగరంలోని పలు వ్యవసాయ క్షేత్రాల సందర్శన , చివరగా వ్యక్తిత్వ వికాస నిపుణులు, నాయకత్వ నేర్పు శిక్షణ కార్యక్రమాల నిర్వహణతో పూర్తయింది. చివరిరోజు యువతీ యువకులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్, ఎస్బిఐ శిక్షణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు మహేష్, ఇతర ప్రభుత్వ అధికారులు, నెహ్రూ యువ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాలు అందజేత

నవతెలంగాణ-రాజంపేట్

రాజంపేట్ మండల పరిధిలోగల కొండాపూర్‌లో జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో ఆర్ బి ఎస్ కే ఆధ్వర్యంలో కంటి అద్దాలను పంపిణీ చేసినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరీష్ గౌడ్ తెలిపారు. ఇటీవల జిల్లా ఆస్పత్రిలో కలెక్టర్ ఆదేశాల మేరకు కంటి వైద్య శిబిరం నిర్వహించామని తెలిపారు. కంటి చూపు మందగించిన విద్యార్థులకు బుధవారం కంటి అద్దాలు అందజేసినట్టు తెలిపారు.

విద్యార్థులు మేధావుల మార్గంలో నడవాలి

- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్యామ్ రావు


విద్యార్థులకు విస్డం ఫర్ ఎక్సెన్స్ పుస్తకాల అందజేత

నవతెలంగాణ-తాడ్వాయి

విద్యార్థులు మేధావుల మార్గంలో నడవాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబీర్ శ్యామ్ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు విస్డం ఫర్ ఎక్సెన్స్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి జీవిత లక్ష్యం ఎంచుకోవాలని మేధావుల చరిత్రలు తెలుసుకుంటూ ముందుకు సాగాలన్నారు. 30 విస్డం ఫర్ ఎక్సెన్స్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండారి సంజీవ్, ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి, రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలంలోని మేనూరు గ్రామంలో 10 లక్షల నిధులతో సిసి రోడ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దరాస్ సాయిలు, మాజీ ఎంపీపీ ప్రజ్ఞా కుమార్, నాయకులు కొండ గంగాధర్, హనుమంతరావు దేశాయ్ తుకారాం, మోహన్ పటేల్, అమూల్, గోపి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు

మొల్ల మాంబ జయంతిని విజయవంతం చేయాలి

- కుమ్మర సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలోని మున్సిపల్ వద్ద నిర్వహించే మొల్ల మాంబ జయంతిని జిల్లాలోని ప్రతి కుమ్మర్లు హాజరై విజయవంతం చేయాలని కుమ్మర్ల సంఘం జిల్లా అధ్యక్షులు కుమ్మరి రాములు, దకూరి మోహన్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16వ శతాబ్ది కాలానికి చెందిన మొల్ల మాంబ అనగారిన వర్గాలను చిన్న చూపు చూస్తున్న ఆ రోజుల్లోనే రామాయణాన్ని సులభతరంగా ఉండాలనే ఉద్దేశంతో తెలుగులో అనువదించి కుమ్మరి కులానికి ఆణిముత్యంగా నిలిచారని సూచించారు. అలాంటి మొల్ల మాంబ జయంతిని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించే కార్యక్రమానికి కుమ్మరులు అధిక సంఖ్యలో తరలిరావాలని పేర్కొన్నారు.

గ్రూప్-2లో 102 ర్యాంకు సాధించిన దాస గంగాధర్



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మగ్గిడి గ్రామానికి చెందిన దాస గంగాధర్ గ్రూప్-2లో రాష్ట్రస్థాయిలో 102 ర్యాంకు సాధించారు. తండ్రి చిన్న గంగాధర్ వ్యవసాయం చేస్తుండగా, తల్లి గృహిణి, గంగాధర్ ఒకటి నుంచి 10వ తరగతి వరకు మగ్గిడి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్మీడియట్ బీకూర్ సోషల్ వెల్ఫేర్, డిగ్రీ, పిజి పట్టణంలోని నరేంద్ర కళాశాలలో చదువుకున్నాడు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని డిస్ట్రిక్ట్ ట్రెజరీ కార్యాలయం యందు జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నత ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో కష్టపడి ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. పాఠకులకు వసతుల గురించి, దినపత్రికలు, పుస్తకాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. బాల్కొండ పరిధిలోని ప్రజలు గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంజీవ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తౌట్ అరవింద్, షేక్ వాహబ్, తదితరులు పాల్గొన్నారు.

మొండి బకాయిల పట్ల కఠినంగా వ్యవహరించాలి

- మున్సిపల్ కమిషనర్ రాజు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ-ఆర్మూర్

మొండి బకాయిల పట్ల కఠినంగా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 100శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని మొండి బకాయిల పట్ల కఠినంగా వ్యవహరించాలని వీలైతే నల్ల కనెక్షన్ కరెంట్ కనెక్షన్ తొలగించాలని, చివరికి సీజ్ చేసి పన్ను వసూళ్ల లక్ష్యం సాధించాలని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రావాలంటే ఇంకా కోటి 15 లక్షల వసూళ్లు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఓ ఉమాదేవి, ఆర్ఐ దత్త రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు వసూలు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలో ఇంటి పన్నుల వసూళ్లకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పన్నులు వసూలు చేసినట్టు గ్రామ కార్యదర్శి రాజేందర్ రావు పేర్కొన్నారు. మార్చి చివరిలోపు 100శాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు గ్రామ కార్యదర్శుల బృందంతో వసూలను చేపట్టినట్లు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో సుమారు 25వేల రూపాయల పన్నుల వసూలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి జాజు శ్రీకాంత్, జక్కు భాస్కర్, కారోబార్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సాక్షిగా గవర్నర్‌తో అసత్యాలు పలికించిన కాంగ్రెస్

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

అసెంబ్లీ సాక్షిగా గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు పలికించడం దారుణం అని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నమ్మి ప్రజలు, రైతులు, మహిళలు, యువత మోసపోయారని అన్నారు. బుధవారం తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగంపై అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. రైతు భరోసా హామీ, ఎకరానికి 15వేలు ఇస్తామని హామీ ఇచ్చి, కేవలం 12వేలు చెబుతున్నారన్నారు. రైతు కూలీలకు రూ.12వేలు ఇచ్చామనే ప్రకటన అయితే నిజంగా ఎంత మందికి ఇచ్చారు? మహాలక్ష్మి పథకంలో ఎవరికి రూ.2,500 అందిందని ప్రశ్నించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌లో ఎంత మందికి బంగారం ఇచ్చారు? , ఎలక్ట్రిక్ స్కూటీలు విద్యార్థినులకు ఇచ్చామంటే ఎంత మందికి అందాయి? అడిగారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగ హామీలు, 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పటివరకు ఎన్ని నోటిఫికేషన్లు? ఎన్ని ఉద్యోగాలు? ఎంతమందికి ఇచ్చారు అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎన్ని కోట్లు విడుదల చేశారు? ఎమ్మెల్యే ఫండ్ ఇవ్వని ప్రభుత్వం, అభివృద్ధిని ఎలా చేస్తుందని దుయ్యబట్టారు.

వర్సిటీ పేరు మార్చటం అంటే తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీయటమే

- వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ ద్వారా కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌కు వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

తెలంగాణ యూనివర్సిటీ పేరు మార్చటం అంటే తెలంగాణ ప్రజల అస్తిత్వాన్ని దెబ్బతియటమేనని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. యూనివర్సిటీ పేరు మార్పు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరి రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరి కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ టీయూ పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. తెలంగాణలి అనే పదం ఉద్యమానికి ప్రతీకఅని, అలాంటి పేరును మార్చటం అంటే తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతియటమే అన్నారు. కార్యక్రమంలో తే.యూ పి డి ఎస్ యూ నాయకులు ప్రిన్స్, దేవిక, రవీందర్, రాకేష్, హుస్సేన్, సాత్విక, గౌతం, బిమేష్,తదితరులు పాల్గొన్నారు.

చేతినిండా ఉపాధిపని కల్పించాలి

- తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-ఎడపల్లి

ఉపాధి హామీ కూలీలకు చేతినిండా పనులు కల్పించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ ద న్వాల్ కు ఉపాధి హామీ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ సరిదాస్ వినతి పత్రాన్ని అందజేశారు. చెరువుల్లో మట్టిపూడిక పనులు చేపట్టినట్లయితే అవసరం ఉన్న రైతులు తమ పంట పొలాలకు తీసుకెళ్తారని ఆయన పేర్కొన్నారు. రైతులకు వ్యవసాయం నిమిత్తం ఉపయోగపడే విధంగా ఉంటుందన్నారు. కూలీలకు ఉపాధి పనులు కల్పించినట్లు అవుతుందన్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ కూలీలకు పనులు లేక ఇంటి వద్ద పస్తులు పడుతున్నారని అందుకు అధికారులు సానుకూలంగా స్పందించి ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని ఆయన కోరారు.

పసుపు వంగడాలు, సాగుపై అవగాహన

- పసుపు పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన హింగోలి మహిళా రైతులు



పసుపు పరిశీధన కేంద్రాన్ని సందర్శించిన మహిళా రైతులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రం శివారులోని శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయం, పసుపు పరిశోధన కేంద్రాన్ని మహారాష్ట్రలోని హింగోలి ప్రాంతానికి చెందిన పలువురు మహిళ పసుపు రైతుల బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. మహారాష్ట్రకు చెందిన స్మార్ట్ ఆత్మ లో భాగంగా ఐదు రోజుల కార్యక్రమంలో హింగోలికి చెందిన వివిధ ఎఫ్ యు గ్రూప్ మహిళ రైతులు పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. మహిళా రైతులు నిజామాబాద్ జిల్లాలో పసుపు సాగు, పసుపు శుద్ధి, ఎగుమతులు తదితర విషయాలపై తెలుసుకొన్నారు. అందులో భాగంగా పశువు పరిశోధన కేంద్రాన్ని మహిళ రైతులు సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణలో సాగుచేసే పంటలు, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ, నూతన యాంత్రీకరణ గురించి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. పసుపు పరిశోధన స్థానంలోని వివిధ రకాల పసుపు వంగడాల సాగు, నూతన వంగడాల అభివృద్ధిపై పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్ మహిళ రైతులకు వివరించారు. పసుపు సాగులో ఆధునిక పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ గురించి అవగాహన కల్పించారు. ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ వల్ల ఎలాంటి లాభాలు పొందవచ్చో కూడా వారికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పశు పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేస్తున్న నూతన పసుపు వంగడాల సాగును, పసుపు సాగులో ఉపయోగించే నూతన యంత్రాలను వారు పరిశీలించారు.



మహిళల సమస్యలపై నిరంతర పోరాటం

- ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత
- ఐద్వా ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఐద్వా మహిళల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తుందని ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత అన్నారు. బుధవారం ఐద్వా ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నగరంలోని నాందేవాడలో జిల్లా కార్యదర్శి సుజాత ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం 1981 నుంచి 2025 వరకు నిరంతరం ప్రజాస్వామ్యం సమనత్వం స్త్రీ విముక్తి కోసం మహిళలపై దేశవ్యాప్తంగా జరుగుతున్న అఘాయిత్యాలపై ఎప్పటికప్పుడు ఆందోళనలు నిర్వహిస్తూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుంది. రానున్న రోజుల్లో మహిళల హక్కుల కోసం పోరాటాలు నిర్వహిస్తామని, మహిళలని చైతన్యపరిచే విధంగా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అనిత, నగర కార్యదర్శి వనజ, ఐద్వా నాయకులు కవిత, సంతోషి, శ్రావ్య, లక్ష్మీ విమల, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు

- చదువుతోపాటు ఆటల్లో తీర్చిదిద్దుతున్నాం
- కరస్పాండెంట్ లక్కారం రాజేంద్రప్రసాద్
- నేడు నలంద పాఠశాల 21వార్షికోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్



నలంద పాఠశాల..

మున్సిపల్ పరిధిలోని నలంద హై స్కూల్ పాఠశాల 21వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్టు పాఠశాల కరస్పాండెంట్ లక్కారం రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ సాగర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్కూల్‌ను 2004లో వెంకటేశ్వర కాలనీ, మామిడిపల్లిలో స్థాపించి 60మంది విద్యార్థులతో స్కూలు ప్రారంభించామని తెలిపారు. 2011-12లో మామిడిపల్లి హైదరాబాద్ రోడ్డు పక్కన ఓన్ బిల్డింగ్‌ను నిర్మించామన్నారు. ఇప్పుడు 830 విద్యార్థులతో ముందుకు దూసుకెళ్తుందని తెలిపారు. దీనికి కారణం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం అనేది గొప్పగా చెప్పుకోవచ్చన్నారు. అకాడమిక్సును ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ విద్యార్థుల ఎదుగుదలలో తోడ్పాటు ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతి సంవత్సరం జరిగే మండల స్థాయి గేమ్స్ లో మార్చి ఫస్ట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో కూడా మంచి ప్రతిభ కనబరిచే విధంగా విద్యార్థులని సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. ఒలంపియాడ్, ఐఐటి, అబాకస్, విద్యార్థులు ఇంగ్లీష్‌లో మాట్లాడే విధంగా వారికి ఇంగ్లీష్ ల్యాబ్, కరికులంస్‌ని విద్యార్థులకు బోధిస్తున్నట్టు చెప్పారు. ఏదో ఐఐటి, ఒలంపియాడ్ చెప్తున్నారు అని కాకుండా విద్యార్థులకు ప్రతి నెల ఔట్-1, ఓయుటి-1 లాంటి పరీక్షలు ఆర్ఎంఎం, ఆర్ఎంఎస్, మేఘ ఒలంపియాడ్, కెసెట్ కాంపిటీటివ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అభ్యాస్ హైదరాబాద్ వారు ఒలంపియాడ్, ఐఐటి కాంపిటేటివ్ పరీక్షలు నిర్వహిస్తూ వాటిలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను హైదరాబాదులో వారిని మెమోంటోస్, ప్రశంసా పత్రాలతో సత్కరిస్తారని తెలిపారు. వీటితోపాటు సైన్స్‌డే, మ్యాథ్స్‌డే లాంటి కార్యక్రమాలను నిర్వహించామని, విద్యార్థుల మానసిక ఉల్లాసానికి కల్చరల్ ఆక్టివిటీస్ నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు స్టేజ్ ఫియర్ పోగొట్టడానికి వారికి స్పీచ్ ఆక్టివిటీస్ నిర్వహిస్తామని, దీంతోపాటు కృష్ణాష్టమి, బతుకమ్మ ఇంకా చాలా మన సాంప్రదాయమైన పండుగలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి క్లాస్ రూమ్‌లో టీవీ, విద్యార్థులకు ఉపాధ్యాయులు ట్యాబ్‌తో బోధించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు డిజిటల్ క్లాస్ ద్వారా బోధిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థుల ఎదుగుదలకు ఉపయోగపడే విధంగా మారుతున్న అకామిక్ చేంజ్ చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామన్నారు. స్కూల్ అకాడమిక్స్‌లో మిగతా వాటిలో సహాయ సహకారాలు అందిస్తున్న ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు నలంద 21వ వార్షికోత్సవం

విజయవంతం చేయండి...



లక్కారం రాజేంద్రప్రసాద్, నలంద పాఠశాల కరస్పాండెంట్

పట్టణంలోని, మామిడిపల్లిలో నలంద స్కూల్ 21 వ వార్షికోత్సవ సంబరాలు స్కూల్ ఆవరణలో నేడు నిర్వహిస్తున్నాం. జబర్దస్త్ టీం ఇస్మార్ట్ ఇమ్మానియేల్, నూకరాజు, చామంతి సీరియల్ యాంకర్ ప్రత్యూష ఇతర అధికారులు వస్తున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు బంధుమిత్రులందరూ పాల్గొని ఇట్టి 21వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయండి.

నిబంధనలు పాటించని ఎస్ఎరార్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

- డీఈఓకు వినతి

నవతెలంగాణ-ఆర్మూర్

నందిపేట మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఎస్ఎస్ఆర్ విద్యా సంస్థ బిల్డింగ్ నిర్మాణం పూర్తికాకుండానే నిబంధనలకు విరుద్ధంగా వచ్చే విద్యా సంవత్సరం కోసం అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్టు ట్రస్మా జిల్లా అధ్యక్షులు రాస నిత్యానందం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా సంవత్సరం పూర్తికాకుండానే వివిధ పాఠశాలలో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌ల నియామకం చేపట్టడం జరిగిందని, నందిపేట్, డొంకేశ్వర్ ఉమ్మడి మండలాలకు చెందిన అన్ని పాఠశాలలకు సంబంధించిన కరెస్పాండెంట్లు జిల్లా కేంద్రంలో డిఇఓ అశోక్ కుమార్‌కు వినతిపత్రం అందజేసి అట్టి పాఠశాలపై తక్షణమే చర్య తీసుకోవాలని పేర్కొన్నారు. డిఇఓ స్పందించి అట్టి పాఠశాలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

కష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు

- ప్రధానోపాధ్యాయురాలు బి.వెంకటలక్ష్మి



నవతెలంగాణ-రెంజల్

విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉందని దూపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి వెంకటలక్ష్మి స్పష్టం చేశారు. బుధవారం పదవ తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకిత భావం, పెద్దల పట్ల గౌరవం ఉన్న విద్యార్థులు తమ భవిష్యత్తును బంగారు బాటగా మార్చుకోవచ్చని ఆమె సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకొని ప్రణాళికబద్ధంగా చదివితే ఉత్తమ ర్యాంకులు సాధించే అవకాశం ఉందని పిఆర్టియు మండల అధ్యక్షులు టి. సోమలింగం గౌడ్ స్పష్టం చేశారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి వెంకటలక్ష్మి, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ బాబన్న మాజీ ఎంపీటీసీ లింగన్న యాదవ్, పి ఆర్ టి యు మండల అధ్యక్షులు టి. సోమలింగం గౌడ్, ఏఎంసీ చైర్మన్ లక్ష్మీ ప్రియ, స్వచ్ఛంద సంస్థ అధినేత రఘుపతి లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తోట గంగారాం మృతి పట్ల కవిత సంతాపం

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ సచివాలయం మాజీ సీఎస్ఓ, నిజామాబాద్ జిల్లా వాస్తవ్యులు, సిరిసిల్ల బెటాలియన్ కమాండెంట్ తోట గంగారాం మృతి దిగ్భ్రాంతికరమని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యక్తం చేశారు. పోలీసు శాఖకు ఉత్తమ సేవలందిస్తున్న గంగారాం లిఫ్ట్ ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తు, గంగారాం ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు తర్వాతే

ఫలితాలు, నియమాకాలు చేపట్టాలి

- మండల అధ్యక్షులు శంకర్
- సాలూరలో ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు ప్రారంభం

నవతెలంగాణ-బోధన్



రిలే దీక్షలో పాల్గొన్న మండల అధ్యక్షులు శంకర్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం అమలు తర్వాతే గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, ఉద్యోగా ఫలితాలు, నియాకాలు చెప్పట్టాలని మండల అధ్యక్షులు శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం సాలూర మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో రిలే దీక్షలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చట్టం చేస్తామని సీఎం ఒకవైపు చెప్తూ వర్గీకరణ లేకుండా పరీక్ష ఫలితాలు విడుదల చెయ్యడమంటే మాదిగలను మోసం చేయడమేనన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఫలితాల విడుదలను విరమించుకొని ఎస్సీ వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన దీక్షలను తగెల్లి గ్రామ స్కూల్ చైర్మన్ గుండారి దేవయ్య మాదిగ ప్రారంభించారు. ఈ దీక్షలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి రెడ్డి దిలీప్ మాదిగ, ప్రచార కార్యదర్శి రెడ్డి శ్యామ్‌రావు మాదిగ, రెడ్డి నాగేష్ మాదిగ, గోనెవార్ మనోహర్ మాదిగ, గుండారి సాయి ప్రసాద్ మాదిగ, రెడ్డి సైదయ్య మాదిగ, తగ్గేలి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కంఠేశ్వర్



జీఆర్ మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ, ఆక్స్‌ఫర్డ్ హై స్కూల్, నిజామాబాద్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ గుట్టలోని ము న్నూరు కాపు సంఘంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాద న్న గారి విఠల్‌రావు, నిజామాబాద్ నార్త్ తహసీల్దార్ నాగా ర్జున, ఎన్పీడీసీఎల్ (ఓపి) ఎస్.ఈ.రవీందర్ ప్రముఖ హైకో ర్టు న్యాయవాది సరళ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయ కులు అపర్ణ, ఎన్నారై నవనీత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఆర్ఎం సొసైటీ అధ్యక్షులు మూడాల నరేష్‌బాబు మాట్లాడుతూ.. ఎన్పీడీసీఎల్ నుంచి రిటైర్ అయిన తర్వాత తమ తండ్రి పేరిట గంగారం మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటుచేసి వివిధ సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు, సంక్రాంతి వేడుకలు, అన్ని రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వ్యక్తుల సన్మానిస్తూ, చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబడిన విద్యార్థులను సన్మానిస్తున్నామని తెలిపారు. పాఠశాలలో హెల్త్ క్యాంపుల నిర్వహణతో పాటు పేద విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంలో తన సతీమణి సహకరించడం తన అదృష్టమన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురికి జైలు శిక్ష

- 13 మందికి జరిమానా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 13 మందికి జరిమానా, నలుగురికి జైలు శిక్ష పడిందని నిజామాబాద్ ట్రాఫిక్ సిఐ ప్రసాద్ బుధవారం తెలిపారు. సిఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం సేవించి వాహనాలు నడిపిన 17 మందికి ట్రాఫిక్ ఏసిపి నారాయణ ఆదేశాల మేరకు బుధవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ట్రాఫిక్ సిఐ ప్రసాద్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం రెండవ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జాన్ ముందు హాజరు పరచగా 13 మందికి 14,500 విధించగా నలుగురికి జైలుశిక్ష పడిందని ట్రాఫిక్ సిఐ ప్రసాద్ తెలియజేశారు. ఉప్పల్‌కు చెందిన సిహెచ్ భాస్కర్, సిరికొండకు చెందిన తోట బాలయ్య, బెంగళూరుకు చెందిన గవల్వాడ్ సురేష్, వినాయక్ నగర్‌కు చెందిన కాళ్లగడ్డ ప్రవీణ్‌లకు జైలు శిక్ష పడిందని తెలిపారు. కావున వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపకారంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మూడు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రం శివారులోని గాంధీ నగర్‌లో బుధవారం రూ.లక్ష విలువైన మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు సిసిఎస్ ఏసిపి నాగేంద్ర చారి ఆధ్వర్యంలో పోలీసులు గాంధీ నగర్ లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యాన్ని గుర్తించారు. మహేంద్ర గూడ్స్ క్యారియర్ వాహనంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యాన్ని, వాహనాన్ని పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వాహనం నుండి లక్ష రూపాయల విలువైన మూడు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యంతో పాటు వాహనాన్ని తదుపరి చర్యల నిమిత్తం కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్లో అప్పగించారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించిన కడమంచి రవిని అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నరేందర్, కానిస్టేబుల్ నవీన్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ ఫైల్స్, పెన్నులు, స్కేల్ వితరణ

నవతెలంగాణ-బోధన్

లయన్స్ క్లబ్ ఆఫ్ భవాని ఆదర్శ ఆధ్వర్యంలో బుధవారం సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్ ఫైల్స్,పెన్నులు, స్కేల్ పంపిణీ చేశారు.ఈ సంధర్భంగ మండల విద్యాధికారి రాజీమంజూష మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు సర్టిఫికెట్లు భద్రపరుచుకొనుటకు ఫైల్స్, పెన్నులు, పెన్సిల్, స్కేలు ఇవ్వడం జరిగిందన్నారు. విద్యార్థుల్లో ఆత్మన్యూనత భావాన్ని తగ్గించటానికి మోటివేషనల్ స్పీకర్ వై. శ్రీనివాస్ అనేక సూచనలు చేశారని తెలిపారు. చిన్నతనంలో క్రమశిక్షణ, దయాగుణం, ఏకాగ్రత, మంచి ప్రవర్తన అలవర్చుకుంటే జీవితం సాఫీగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పావులూరి వెంకటేశ్వరరావు, సాలూర గ్రామ ఆర్ఎంపి వైద్యులు సాయిలు, ఉపాధ్యాయులు విజయ్ కుమార్, విజయలక్ష్మి, శోభారాణి, లక్ష్మి ,జ్యోత్స్న సంగీతరావు, సుధారాణి, అబ్బయ్య, రాజ్ కుమార్, స్వామి, విట్టల్ కాంబ్లే,వనజ, సాయిలు విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలపై అవగాహన

- జయం కేపీఎం రైతు ఉత్పత్తి దారుల సంఘాన్ని సందర్శించిన
- హింగోలి జిల్లా రైతు మహిళ ఉత్పత్తిదారుల సంఘాలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మనోహరాబాద్ గ్రామంలోని జేఎం కేపిఎం రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని మహారాష్ట్ర ఇంగోలి జిల్లా రైతు మహిళ ఉత్పత్తిదారుల సంఘాల మహిళ ఉత్పత్తిదారులు బుధవారం సందర్శించారు. మహారాష్ట్ర ఇంగోలి జిల్లా నుండి పహిని, గిరిగావ్, తూర్పు పింప్రిల్ అట్లాగే పాంగ్రా సిండి అనే గ్రామాల నుండి నారి అనుముల్ అనే మహిళా రైతు ఉత్పదారుల సంఘాల నుండి మహిళా రైతులను మహారాష్ట్ర ప్రభుత్వంలోని స్మార్ట్ ఆర్గనైజేషన్ ద్వారా మనోహరాబాద్ గ్రామంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని సందర్శించారు.



రైతు ఉత్పత్తిదారుల సంఘం గురించి తెలుసుకుంటటున్న హింగోలి మహిళా రైతులు

ఈ సందర్భంగా స్మార్ట్ ఆర్గనైజేషన్ మహారాష్ట్ర ప్రభుత్వ రైతు ఉత్పత్తిదారుల సంఘాల అధికారి బాలాజీ రాథోడ్ పసుపు పరిశ్రమ గురించి తెలుసుకొని మహిళా రైతులకు వివరించారు. స్థానిక జెఎంకెపియం డైరెక్టర్ పాటుకూరి తిరుపతిరెడ్డి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు నిర్మాణం, బలోపేతం, మార్కెటింగ్ విషయాలు వివరించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలపట్ల అవగాహన కల్పించడంతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భన ఎన్నో విధాలుగా సహకరిస్తుందని వారు అభిప్రాయం వెలిబుచ్చారు. కార్యక్రమంలో జేఎంకేపిఎం సూపర్వైజర్ రోడ్డ రుత్విక్ , సభ్యులు కంఠం మల్లయ్య పడకల్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల అరెస్ట్

నవతెలంగాణ-బోధన్

పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచులు ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం సాలూర, బోధన్ మండలాలకు చెందిన పలువురు మాజీ సర్పంచ్ లను బోధన్ రూరల్ పోలీసులు అరెస్టులు చేశారు.ఈ సంధర్భంగ మాజీ సర్పంచులు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు మంజూరి చేయని ప్రభుత్వం అసెంబ్లీ ముట్టడి చేస్తారెమోననే భయంతో మాజీ సర్పంచ్ లను ముందస్తు అరెస్ట్ చేయడం సిగ్గు చేటని విమర్శించారు.ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు.అరెస్టయిన వారిలో గంగాధర్, సుదర్శన్, తారాచంద్ ఉన్నారు.

ఉపాధిహామీ పనులపై ప్రజా వేదిక

నవతెలంగాణ-బోధన్

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా బోధన్,సాలూర మండలాల్లో చేపట్టిన పనులపై బుధవారం బోధన్ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ 15వ విడత ప్రజావేదిక నిర్వహించారు. ఇందులో భాగంగా డ్వామా పీడీ సాయాగౌడ్ ఉపాధిహామీ పనుల్లో చేపట్టిన వివరాలను ప్రజావేదికలో రికార్డులు తనిఖీ చేసి పరిశీలించారు.ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనుల వివరాలను ఆడిట్ సిబ్బంది వారి నివేదికను పీడీ సాయాగౌడ్ కి వివరించారు. ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ ల సమక్షంలో చేపట్టిన పనుల వివరాలను సరిచూసుకున్నారు. పలుచోట్ల లోపాలున్న గ్రామాల్లో మరోసారి తప్పిదాలు లేకుండా ఉపాధిహామీ పనులు చేపట్టాలని పీడీ సాయాగౌడ్ ఉపాధిహామీ సిబ్బందిని ఆదేశించారు.ఈ ప్రజావేదికలో ఎంపీడీఓ బాలగంగాధర్, ఏపీఎం హేమలత,టీఏ అల్తాఫ్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ముప్కాల్ మహిళా స్త్రీ శక్తి సమాఖ్యకు ఉత్తమ మహిళా అవార్డులు

నవతెలంగాణ-ముప్కాల్

జిల్లా గ్రామీణభివృద్ధి సంస్థ' ఆధ్వర్యంలో బుధవారం నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని 'రాజీవ్ గాంధి ఆడిటరియం'లో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా 'మహిళా స్త్రీ శక్తి సమాఖ్య' అవార్డులను డీఆర్డీవో సాయగౌడ్, అసిస్టెంట్ పీడీ రవీందర్ చేతుల మీదుగా ప్రదానం చేశారు.. కార్యక్రమంలో భాగంగా ముప్కాల్ 'మహిళా స్త్రీ శక్తి సమాఖ్య' ఉత్తమ మహిళా సమాఖ్య అవార్డును సమాఖ్య అధ్యక్షురాలు బి. జ్యోతి అందుకున్నట్లు ఎంపీఎం ప్రసాద్ రావ్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని వేంపల్లి చెందిన అన్నపూర్ణ ఉత్తమ సీసీగా, మండల కేంద్రానికి చెందిన వివోఏ అరుణ సైతం సన్మానం పొందిన వారిలో ఉన్నారు. వీరు జిల్లాలో బ్యాంక్ లింకేజ్ ద్వారా 125 శాతం, స్త్రీ నిధి ద్వారా 140 శాతం చూపుతూ జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనపరిచినందుకుగాను ప్రశంసా పత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో స్త్రీ శక్తి సమాఖ్య జిల్లా, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం ప్రారంభం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని బంగారుపల్లి గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పలువురు లబ్ధిదారులు ప్రారంభించినట్టు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. బుధవారం బంగారుపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామానికి 105 డబుల్ బెడ్ రూమ్‌లు మంజూరైనవని తెలిపారు. అందులో కొంతమంది ఇండ్ల నిర్మాణం కొరకు పనులను ప్రారంభించారని, ఇంకొంతమంది పనులు ప్రారంభించలేదని, అందులో భాగంగా నేడు గ్రామాన్ని సందర్శించి, జరుగుతున్న నిర్మాణం పనులను పరిశీలించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామంలో మంజూరైన ప్రతి ఒక్క లబ్ధిదారులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రారంభించాలని పనులు పూర్తి చేసిన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరైన నిధులను విడుదల చేసినప్పుడు లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

- జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతి
- మత్స్యకారులకు వృత్తి నైపుణ్యత పరీక్షలు

నవతెలంగాణ-లింగంపేట్

మత్స్యకారులు వృత్తిపై ఆధారపడి ఆర్థికంగా ఎదగాలని జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతి అన్నారు. బుధవారం మండలంలోని బాయంపల్లి గ్రామ సమీపంలోని పటేల్ చెరువులో గ్రామానికి చెందిన మత్స్యకారులకు వృత్తి నైపుణ్యత పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. 18 మంది మత్స్యకారుకులకు వలవేయడం, ఈత కొట్టడం, పాండ్రి లాగడం లాంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి గుర్తింపు కార్డులు త్వరలోనే అందించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందని, ఐక్యమత్యంతో కలిసికట్టుగా చిన్న గ్రామంలో మత్స్య సహకార సంఘం ఏర్పాటు చేయడం అర్పించదగ్గ విషయమన్నారు. సంఘం నిర్వహించి ఆర్థికంగా ముందుకు వెళ్లేందుకు మత్స్య సహకార శాఖ అన్ని విధాలుగా సహకరిస్తుంది తెలిపారు. సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని మత్స్యకారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ గాదం సత్యనారాయణ, జిల్లా సహకార సంఘం ఆడిటర్ శ్రీనివాస్ జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్ బెస్త్ సాయిలు, మండలం తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు సాయికుమార్, మత్స్య సహకార సంఘం ఫీల్డ్ ఆఫీసర్ సురేష్, మాజీ ఎంపిటిసి వర్నింటి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

నవతెలంగాణ-దోమకొండ

ప్రభుత్వం మహిళా సాధికారత కోసం, మహిళా సంఘాల సభ్యులను ప్రోత్సహిస్తూ ఏర్పాటు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ల ద్వారా , మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దోమకొండ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో, ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను, ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణం తోపాటు ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘం ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని మహిళలు అన్ని రంగాలలో ఆర్థిక అభివృద్ధి సాధించాలని సూచించారు. ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణంలో, నాణ్యతతో పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఈ నెల 31 వరకు ఫీజును ఆన్ లైన్ లో చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జ్యోతి,ఎంపిడివో ప్రవీణ్ కుమార్ , అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామాలలో బుధవారం కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ తెలిపారు. లింగంపేట మండలంలోని లింగంపేట్ శెట్టిపల్లి సంగారెడ్డి పరిమళ్ళ ఎక్కపల్లి సజ్జనపల్లి పోల్కంపేట్ కోమటిపల్లి పోతాయిపల్లి సురాయపల్లి ఒంటరపల్లి తండాలో25 మంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి కళ్యాణ లక్ష్మి చెక్కులను నేరుగా కుటుంబ సభ్యులకు అందించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు పేదలకు కల్యాణ లక్ష్మి చెక్కులు సకాలంలో అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త వంజరి ఎల్లమయ్య యూత్ అధ్యక్షులు రాజు పట్టణ అధ్యక్షులు ప్రసాద్ గౌడ్ సాయికుమార్ బాలయ్య రవి నాగరాజు పాషా తో పాటు ఆయా గ్రామాలకు గ్రామ కమిటీ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

విద్యుత్ మరమ్మతులు స్వతహాగ చేపట్టొద్దు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

రైతులు తమ పొలాల వద్ద నెలకొనే విద్యుత్ సమస్యలపై స్వతాహాగ మరమ్మతులు చేపట్టొద్దని ట్రాన్స్‌కో అధికారులు సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం, మాల్ తుమ్మెద గ్రామాలలో బుధవారం రోజు ట్రాన్స్కో ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం ట్రాన్స్కో అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ట్రాన్స్ఫార్మర్లపై అవగాహన కల్పించారు. ట్రాన్స్ఫార్మర్ల వద్ద రైతులకున్న సమస్యలను పరిష్కరించారు. రైతులు పొలాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రాన్స్ఫార్మర్ల నుండి ఆయిల్ చోరీ కాపర్ వైర్ల చోరీ తరచుగా జరుగుతున్నాయని కొత్త వ్యక్తులను గమనిస్తే పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఈఈ విజయసారథి, ఏడిఈ నాగేందర్ రెడ్డి, ఏఈ నాగరాజు, లైన్ ఇన్స్పెక్టర్ సురేందర్‌తో పాటు సిబ్బంది ఈశ్వర్ నరేష్ తదితరులు ఉన్నారు.

సాగుపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ విశ్వవిద్యాలయంలో నిజామాబాద్, సిఐఎంఏపి హైదరాబాద్ ఆధ్వర్యంలో ఔషధ, సుగంధ ద్రవ్య వాణిజ్య పంటల సాగుపై రైతు అవగాహన సదస్సు లో ముఖ్య అతిథిగా నిజామాబాద్ ఎంఎంసి చైర్మన్ ముప్ప గంగారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మోపల్ పిఏసిఎస్ చైర్మన్ గంగారెడ్డి, ఎఎంసి డైరెక్టర్లు గంగారెడ్డి రెడ్డి, నరేందర్, రాజలింగం పాల్గొన్నారు.

టీయూ పేరుమార్చి చరిత్ర హీనులుగా మారకండి

- వర్సిటీ పేరును మార్చే ప్రతిపాదనను కాంగ్రెస్ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-డిచ్‌పల్లి



వీసికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తెలంగాణ యూనివర్సిటీ పేరు మారిస్తే.. రాష్ట్ర చరిత్రలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చరిత్రహీనులుగా మిగిలిపోతారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విఘ్నేష్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తెలంగాణ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరి రావుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విగ్నేష్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు కొరకు ఎస్ఎఫ్ఐ అనేక పోరాటాలు నిర్వహించి తెలంగాణ యూనివర్సిటీ ని సాధించినట్టు గుర్తుచేశారు. గత వైయస్సార్ ప్రభుత్వ హయాంలోనే ఈ యూనివర్సిటీ కి"తెలంగాణ యూనివర్సిటీ"అని నామకరణం చేసినట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పేరుతో ఏర్పడిన ఏకైక యూనివర్సిటీ తెలంగాణ యూనివర్సిటీ అని, అలాంటి చరిత్ర కలిగిన దానికి పేరు మార్చడం అంటే ఈ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అవమానించడమే అవుతుందన్నారు. అదేవిధంగా ఈ యూనివర్సిటీ పేరు మారిస్తే సీఎం రేవంత్ రెడ్డి చరిత్ర హీనుడిగా మిగులుతారని అన్నారు. యూనివర్సిటీ పేర్లు మారుస్తే అభివృద్ధి కాదని ఈ బడ్జెట్ సమావేశాలలో యూనివర్సిటీకి ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేయాలి తప్ప పేరు మార్చే అనాలోచిత నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఈ జిల్లా ప్రజల కోసం ప్రభుత్వంతో పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రభుత్వానికి లేఖలు రాయాలని అన్నారు. ప్రభుత్వం మొండి వైఖరితో ఉంటే తెలంగాణ యూనివర్సిటీ నుండి కాంగ్రెస్ ప్రభుత్వం పతనం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షులు శివ, ఉపాధ్యక్షులు నిరంజన్, నాగేంద్ర, వెంకటేష్, సాయి, తదితర నాయకులు పాల్గొన్నారు.

జీరో బ్యాలన్స్ కరెంటు అకౌంట్లు ఓపెన్ శిబిరం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కోర్టు ఆవరణలో పంజాబ్ నేషనల్ బ్యాంకు గుర్భబాది బ్రాంచ్ ఆధ్వర్యంలో జీరో బ్యాలన్స్ కరెంటు అకౌంట్లు ఓపెన్ చేయించుటకు శిబిరం మేనేజర్ సిహెచ్. మాధవిలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి కుంచాల సునీత ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమం చాలా మందికి ఉపయోగపడుతుందని, జీరో బ్యాలెన్స్ అకౌంట్ వల్ల డబ్బులు ఆదా చేయవచ్చని, న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి ఉపయుక్తంగా ఉంటుందని తెలియచేశారు. ఈ కార్యక్రమానికి సీనియర్ న్యాయవాది రావులపల్లి జగదీశ్వర్ రావు, ఇతర న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొని విజయవంతం చేశారు. రేపు కూడా ఈ శిబిరం ఉంటుందని తర్వాత తమ బ్రాంచిలో ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు.

ప్రెసిడెన్సీ ఇంటర్నేషనల్‌పై చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యాశాఖ నుండి ఎటువంటి అనుమతి లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థులు తల్లిదండ్రులు మోసం చేస్తున్న ప్రెసిడెన్సీ ఇంటర్నేషనల్ విద్యాసంస్థల (ఆరావళి క్యాంపస్) మీద చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అంజలి, రఘురాం నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ను కలిశారు. డీఈవో సానుకూలంగా స్పందించి వెంటనే ఆదేశాలను జారీ చేస్తానని అన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సుభోద్, నవీన్ కృష్ణ, కుషాల్ ,దినేష్, రంజిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధిలో జిల్లాస్థాయిలో ఏడవసారి ప్రథమ అవార్డు

నవతెలంగాణ-ఆర్మూర్



జిల్లా స్థాయిలో "మహిళా శిశు దివ్యంగుల వయోవృద్ధుల ట్రాన్స్ జెండర్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా స్త్రీనిధిలో ప్రతిభ కనబర్చినందుకు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్పందన, ఏపీఎం గంగారాం అడిషనల్ డిర్డివో రవీందర్ చేతుల మీదుగా బుధవారం అవార్డు అందుకున్నారు . ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రథమ అవార్డు రావటం ఇది ఏడోసారి అని అన్నారు

వీఆర్‌ఏల ముందస్తు అరెస్టులు



అరెస్టయిన వీఆర్ఏలు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని వివిధ గ్రామాల వీఆర్ఏలను పోలీసులు ముందస్తుగా బుధవారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ భవన్ ముట్టడి సందర్భంగా పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారన్నారు. 61 సంవత్సరాలు నిండిన విఆర్ఎల వారసులకు జి ఓ నెం 81, 85 ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అరెస్టు అయిన వారిలో మండల అధ్యక్షులు అసది భాస్కర్, జెనరల్ సెక్రటరీ బేగరి ముత్తన్న, వీఆర్ఏలు పాల్గొన్నారు

తక్కువ ఫీజుతో పేదలకు వైద్యం అందించాం

శ్రీ సంజీవని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వార్షికోత్సవంలో మేనేజ్‌మెంట్ ప్రతాప్



అరెస్టయిన వీఆర్ఏలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ శ్రీ సంజీవని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ 5వ వార్షికోత్సవం బుధవారం హాస్పిటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజ్ మెంట్ ప్రతాప్, సుమన్ మాట్లాడుతూ.. మా హాస్పిటల్‌లో ఐదు సంవత్సరాలనుండి చేసిన డెలివరీల్లో ఎక్కువ శాంతం నార్మల్ డెలివరీలు చేసినట్టు తెలిపారు. తక్కువ ఫీజు లతో ఎంతో మంది పేద వారికి వైద్యం అందజేశామన్నారు. అనేక గ్రామాలలో ఎన్నో ఉచిత వైద్య, శిబిరాలు ఏర్పాటు చేసి పేదవారికి, వైద్యం అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రమేష్ , డాక్టర్ శ్రీలత గైనాకలాజిస్ట్, డాక్టర్ వంశీ కృష్ణ, డాక్టర్ శ్రీకాంత్‌ను శాలువా, మెమొంటోతో సత్కారించి కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజ్ మెంట్ సుమన్. ప్రతాప్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

నవతెలంగాణ-మెండోర

మాజీ సర్పంచ్ ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా మాజీ సర్పంచ్ లను బుధవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ.. పదవిలో ఉన్నప్పుడు అప్పులు తీసుకొచ్చి లక్షల రూపాయలు వెచ్చించి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామన్నారు. పదవికాలం ముగిసి సంవత్సర కాలం దాటిందన్నారు. అయినా ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించలేదన్నారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ముందస్తు అరెస్టు చేసిన వారిలో మాజీ సర్పంచ్‌లు మిస్బొద్దీన్, సామ.గంగారెడ్డి, ఉప సర్పంచ్ మచ్చర్ల.రాజరెడ్డి, గోపిడి గంగారెడ్డి ఉన్నారు.

31లోపు ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లించాలి

నవతెలంగాణ-మెండోర

మండల ప్రజలు మార్చి 31 లోపు ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించి 25 శాతం రాయితీ పొందాలని డిఎల్పిఓ శివకృష్ణ సూచించారు. ఈ సందర్భంగా దూదిగాం బుస్సాపూర్ గ్రామాలను సందర్శించి ఎల్ఆర్ఎస్ రుసుం కట్టించారు. అనంతరం దూదిగాం గ్రామపంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లింపులపై అవగాహన కల్పించారు. వెయ్యి రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యాజమానులు 25శాతం రాయితీతో క్రమబద్ధీకరణ చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీవో



మాట్లాడుతున్న ఎంఈవో సాయిరెడ్డి

విద్యార్థుల అభివృద్ధిలో

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థులకు ఎందులో ప్రతిభకు ఎక్కువగా ఉంటుందో... దానిపైన ఎక్కువ శ్రద్ధ వహించాలని, ఇందులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమైందని నిజామాబాద్ సౌత్ జోన్ ఎంఈఓ సాయి రెడ్డి అన్నారు. నగరంలోని ది ఎయిర్ ఫోర్స్ స్కూల్ గాజుల్ పేట వారు గుజరాత్ ఫంక్షనల్ హాల్‌లో బుధువారం కల్చరల్ మీట్ 2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పలువురు నగర పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ను, పెద్దలను ది ఎయిర్ ఫోర్స్ స్కూల్ కరస్పాండెంట్, మేనేజ్మెంట్ గిరిష్ సన్మానించారు. క్రీడాలలో గెలుపొందిన విద్యార్థులకు, సాంస్కృతిక కర్యక్రమల లో గెలుపొందిన విద్యార్థులకు, తరగతి గదిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమొంటోలను అందించి ప్రశంసించారు .కార్యక్రమంలో గజానంద్, గంగాధర్, రాములు, జాదు రంగనాథ్, సరంజిత్ సింగ్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.